# సమర్థ సద్గురు

అధ్యాత్మిక మాసపత్రిక

జులై 2023

వెల : రూ. 10.00



10-05-23 నాడు శ్రీ కాళీవనాశ్రమము శాఖ, భీమవరం నందు
బృందావనం శంఖుస్థాపన







# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



**సంపాదక వర్గము**

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సి.వి. రమణ బాబు

పి.యస్.ఆర్.కె. ప్రసాద్

కె. మురళీ మోహన వర్మ



సంపుటి 42 సంచిక 11

పేజీలు 44

జులై 2023

5సం॥ల చందా రూ. 500

2సం॥ల చందా రూ. 240

సంవత్సర చందా రూ. 120

విడిప్రతి వెల...... రూ. 10

**బ్యాంక్ డ్రాఫ్టు** Y.S.C.K.P.M **చారిటబుల్ ట్రస్ట్ , A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా**

**మేనేజరు**

**సమర్థ సద్గురు మాగజైన్**

**శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు**

**గుంటూరు జిల్లా**

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD


**ఈ సంచికలో** ............................. ....... **పేజీ**


దాశరథీ శతకము ............................. ..........4

శ్రీబాబూజీ ఉవాచ........................................ 5

అమ్మమాట.................................... ............ 8

దైవం మానుష రూపేణ............................. 10

అగస్త్య హృదయం ...................... ..............12

పండు ................ ...................................... 14

సంసారపంకనిర్మగ్న సముద్ధరణ పండితా..............17

ధ్యానానికి మించిన తీర్థయాత్ర లేదు..19

గులాబీ కంపు .......... ................. ................. 21

గెహనీ నాథులు ........................... ................25

శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు .....................28

మనశ్శతకము ................................................29

నిరీక్షణ ...........................................................30

ప్రకృతి నియమాలు .......................................32

ఈశావాస్యోపనిషత్..........................................33

గురు రక్షణకు దూరం అడ్డు రాదు .......35

గురువు వెంట వుంటే ........ .......................37

సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....39

విష్ణు కథలు ....... ............................ ....................41

36) **ఖరకరవంశజా విను మఖండిత భూతపిశాచఢాకినీ**
**జ్వర పరితాపసర్పభయ వారకమైన భవత్పదాబ్జ ని**
**స్పుర దురువజ్రపంజరముజొచ్చితి, నీ యెడ దీన మానవో**
**ద్ధర బిరుదంక మేమఱకు దాశరథీ! కరుణాపయోనిధీ!**



భావం - వేడి కిరణములు గల్గిన సూర్యుని వంశములో పుట్టినవాడా, విను - ఘోరమైన భూత, పిశాచ, ఢాకినీ, సర్పాది భయముల పోగొట్టు నీ పాదపద్మములనెడి వజ్రపంజరములో ప్రవేశించాను. ఇప్పుడు దీనుల నుద్ధరించువాడవను నీ బిరుదును మరువక నన్నుద్ధరించు దాశరథీ! కరుణాపయోనిధీ!

*శ్రీబాబూజీ చేసిన వజ్రాల వ్యాపారం ఏమిటి?
*ప్రకృతికి, ప్రపంచానికి తేడా ఏమిటి?
*ఏది అరగకపోతే అహంకారం పెరుగుతుంది?
*శ్రీరామ పట్టాభిషేకానికి ముహూర్తం పెట్టినదెవరు?
*మట్టిబొమ్మలోనుండి ఉద్భవించిన మహాత్ములు ఎవరు?
*కృష్ణుడు పాండవులకు దోసకాయను ఎందుకు ఇచ్చాడు?
*నరేంద్రుని చూసి శ్రీరామకృష్ణులు ఎందుకు ఆశ్చర్యపోయారు?
*గురువుగారిలో వివిధ గుణాలు ఉన్నట్లుగా ఎందుకు కనిపిస్తాయి?
*మలమూత్రాదులతో కూడిన దేహాన్ని దేవాలయంగా మార్చేది ఎవరు?
*కాలసర్పం యొక్క ఆరు కోరలు ఏవేవి?

***సమాధానాలు లోపలి పేజీలలో ............................***

# శ్రీ బాబూజీ ఉవాచ - కీ.శే. పరాశర ప్రసాద్

1-8-1981

ఈరోజు సాయంత్రం ప్రార్థన జరుగుతుండగా శ్రీ బాబూజీ వచ్చారు. ప్రార్థన అయిన తర్వాత కొలదిసేపు సంకీర్తన జరిగిన తర్వాత శ్రీ బాబు బోధ చేశారు.



"భగవన్నామము పవిత్రమైనది. ఆ పవిత్ర నామము యొక్క రుచి తెలియకుండా మాయ అడ్డు వస్తుంది. మాయ చాలా చిత్రమైనది. అది మానవునికి భోగభాగ్యాలు, ధనధాన్యాలు నిత్యమని భ్రమింపజేస్తుంది. ఇంద్రియ సుఖాలే నిత్యమని భ్రమింపజేస్తుంది. అనిత్యమైన జగత్తు మీదనే వ్యామోహాన్ని కలిగింపజేస్తుంది.

మాయకు లోబడిన మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము అనబడే అంతఃకరణము, సంకల్పముల తోనూ, ఈర్ష్య, అసూయత, అసహనము, ద్వేషములతోనూ కూడి వుంటుంది. అట్టి మాయకు లోబడిన మానవుడు, కాలసర్పపు నోటిలో వున్నప్పటికీ భౌతిక సుఖాలనే ప్రేమిస్తాడు.

కప్ప పాము నోటిలో చిక్కుకుని ఉన్నప్పటికీ పాము నోటినుండి విడిపించుకునే ప్రయత్నము చేయకపోగా, నోటివద్దకు వచ్చిన ఈగని పట్టడానికి ప్రయత్నిస్తుంది.

అలాగే మానవుడు కాలసర్పము నోటిలో మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారమనే నాలుగు కోరలలో చిక్కుకుపోతాడు. వీటిని దాటిన తర్వాత మధ్యలో అహంకార మమకారములనబడే రెండు విషపూరిత కోరలున్నాయి. వాటిలో ఉన్న విషము, క్రిందనున్న నాలుగు కోరలలో వ్యాప్తమై ఉంటుంది. ఈ నాలుగు కోరలద్వారా ఈర్ష్య, అసూయత, అసహనము, ఓర్వలేనితనముతో బాధపడి జననమరణ విషవలయంలో చిక్కుకుంటాడు. వీటిలో ఏ ఒక్క గుణము ఉన్నా చాలు.

వాడు పరమాత్ముడి అనుగ్రహము ఎన్నటికీ పొందజాలడు. పరమాత్ముడు శాంతగుణం కలవాడినే అనుగ్రహిస్తాడు.

మానవుడికి కాలసర్పపు కోరలనుండి విముక్తిపొందే మార్గమే లేదా? అంటే ఉంది. మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము అనే కాల సర్పపు కోరలు విషయరహితమై సత్యము, శాంతి, దయ, ప్రేమగా మారి, మానవునికి శాంతిని, ఆనందాన్ని పొందింపజేసే దివ్య ఔషధము అవుతాయి.

క్రమశిక్షణతో ఉదయము 4గం॥వేళకే లేచి పరమాత్ముని యందు మనస్సు నిలిపి పరమాత్ముని నామాన్ని ధ్యానించాలి. ఆయనకి అయిదు నిమిషాలు కేటాయిస్తే చాలు. ఎక్కడికక్కడే వెంకటలక్ష్మి అని సంతుష్టి చెందుతాడు పరమాత్ముడు. ఆయన అనుగ్రహమూర్తి. ఆయనకి కేటాయించిన కాలము నిత్యకాలములో జమ అవుతుంది. అలా చేయటం వలన పుణ్యం పెరిగి పాపం హరించిపోతుంది. బుద్ధ భగవానుడు అదే బోధించాడు, "పాపాన్ని ఖర్చుచేసి పుణ్యాన్ని ఆర్జించ"మన్నాడు. నిత్యకాలంలో జమ అయిన తర్వాత అది తరగదు. మీరు బ్యాంకులో వేసుకొన్న ధనము ఎలా చక్కగా నిల్వ ఉంటుందో ఇది కూడా అంతే.

మీ గృహంలో ఒక పూజా మందిరాన్ని ఏర్పరచుకొని తెల్లవారు జామునే లేచి, స్నానముచేసి, భగవంతుని మనస్సులో నిలుపుకొని కనీసం అయిదు నిమిషాలు మీ ఇష్టదైవాన్ని స్మరిస్తూ ధ్యానం చేయండి. అలా వీలు లేకపోతే మీ హృదయమనే పూజామందిరంలోనే భగవంతుని రూపాన్ని నిలుపుకొని స్మరించండి. ఎలా వీలుంటే అలా చేయండి. అలా చేయగా చేయగా, మీ మనస్సు పరమాత్ముని చరణారవిందములపై నిలిచి ఆనందాన్ని పొందుతారు. దానిద్వారా మీకు మంచి ఆలోచనలు వస్తాయి. ఇహంలో భోగభాగ్యాలు, పరంలో నిరతిశయమ్మైన పరమపదము లభిస్తుంది. కొంతమంది ఎంతో కష్టపడి ధనాన్ని ఆర్జిస్తారు. దానిని ఎక్కువ వడ్డీకి అప్పు ఇస్తారు. తీసుకునేవారు నమ్మించి తీసుకుంటారు. ఎంత వడ్డీ అయినాసరే అంటారు. అసలు తీర్చే ఉద్దేశ్యము ఉంటే కదా!

కాని పరమాత్ముని వద్ద నిలువ చేసుకున్న ధనము అలా ఎన్నటికీ తరిగేది కాదు. అది శాశ్వతమైనది. గురుదేవుని, పరమాత్ముని వేరు చేయటానికి లేదు. గురుదేవుని ప్రేమ, వాత్సల్యము అపారమైనది. శాశ్వతమైనది. దానిని ఎవరూ దొంగిలించలేరు. కాని తల్లిదండ్రుల ద్వారా సంక్రమించే ధనము అనిత్యమైనది. ఇది సుఖము, శాంతికన్నా దుఃఖాన్ని తీసుకువస్తుంది. గురుదేవుడు ఇచ్చే ధనము ఎటువంటిది?

గురుదేవుడు ప్రసాదించే లక్ష్యార్థమునకు మించిన ధనము ఉందిటయ్యా పిచ్చివాళ్లలారా! గురులక్ష్యార్థముపై మనస్సు నిలిపితే వచ్చే ఫలితం ఏమిటి చెప్పండి చూద్దాం? అది జనన మరణమనే మృత్యుసాగరము నుండి రక్షిస్తుంది. మానవుణ్ణి మరణమనే భయము నుండి రక్షిస్తుంది.

అయితే గురువిచ్చిన లక్ష్యార్థమునందు విశ్వాసము మాత్రము ఉండాలి. అది లోపిస్తే ఫలితము ఉండదు. గురువాజ్ఞ మీరినవాడికి కలిగే కష్టాలు చెబితే గుండె పగిలి చస్తారు. గురువాజ్ఞ మీరినవారే బ్రహ్మ పిశాచములు అయ్యేది. అటువంటి వారిని కూడా గురువు రక్షించుకుంటాడు. గురువాజ్ఞ మీరి దుష్ఫలితాలు పొందే వారికోసం గురుదేవుడు ఎంత తపన చెందుతాడో! వారిని రక్షించుకోవటం కోసం తన తపోశక్తినంతా ధారపోస్తాడు" అన్నారు శ్రీ బాబు.

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, దిండి వాస్తవ్యులు వెంట్రప్రగడ రమణ గారు 23-5-23 మంగళవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 61 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

(గత సంచిక తరువాయి) **అమ్మ మాట** - జపమాలా ప్రసాద

## ప్రణవ స్వరూపుడు గురుదేవుడు

తరించాలి అని అనుకునే సాధకుడు ధ్యానం చేసి తీరాలి. నిరంతరం సంకల్ప, వికల్పాలతో గాలిలోని దీపంలా చలించే మనస్సును ఒకే ఒక్క పరమాత్మ వస్తువు మీద కేంద్రీకరించడానికి చేసే సాధనే ధ్యానం. నిరంతర విచారణ కూడా సాధకుడికి అత్యంత ఆవశ్యకం. **ధ్యాన మూలం గురోర్మూర్తిః పూజా మూలం గురోః పదమ్, మంత్రమూలం గురోర్వాక్యమ్, ముక్తిమూలం గురోః కృపా** - అని చెబుతున్నది గురుగీత.

సగుణరూపాన్ని ధ్యానించేటప్పుడయితే, సాధకుడు తన ఇష్ట దైవం యొక్క మూర్తినిగాని, తన గురుమూర్తి యొక్క మూర్తినిగానీ ఎదురుగుండా పెట్టుకుని, నఖశిఖ పర్యంతం గురు స్వరూపాన్ని ధ్యానించవచ్చు. పూజకు మూలం గురుదేవుని యొక్క పాదాలు అని, పదములని కూడా మనం గ్రహించాలి.



గురు ముఖస్తుగా ఏ నామం, ఏ వాక్యం, ఏది ప్రసాదించారో అదే మంత్రం. గురువుగారు 'ఛీ! ఫో!' అన్నా అది మంత్రం ఎలా అయిందో అనే ఇతిహాసాన్ని మనం ఇదివరలో వినే వున్నాము. శ్రీబాబూజీ వారు, ఎంతో తీవ్ర వ్యాధులతో, బాధలతో వచ్చినప్పుడు 'ఛీ! ఫో!' అనేసరికి వారికా వ్యాధి ఎలా నయమైపోయేదో మనమందరం చూసే వున్నాం.

ఇక 'ముక్తి' అంటారా, గురుదేవుని కృప మనపై వుంటే యిక ముక్తిని గురించి వేరే ఆలోచించాలా? ఈ విధంగా మనం ఆచరించ గలిగితే చాలు తరించడానికి.

'ఉన్నది అన్న ఉనికే' మనం నమ్మిన దైవం. ఆయన మనని ఎప్పుడూ వెన్నంటే వుంటారు. ఈ దేహం ఎంత మలమూత్రాదులతో కూడుకుని వున్నా, నిర్మలమైన హృదయంలో ఆయన తనని తానే ప్రతిష్ఠ చేసుకుని, ఈ దేహాన్ని దేవాలయంగా మారుస్తాడు అని స్కందోపనిషత్తు మనకి చెబుతోంది **దేహో దేవాలయః ప్రోక్తః జీవో దేవ స్సదాశివః** అని. తనలో

వున్న ఈశ్వరుడు తనకే కానరాకుండా పంచకోశాలతోటి, మూడు గుణాలతోటి, మూడు అవస్థలతోటి, ఇంకా ఎన్నో, ఎన్నో ముళ్ళతో ఆయనని కప్పేసి, తనను తాను జీవుడని చెప్పుకుంటున్నాడు మానవుడు. ఆ అజ్ఞానమనే నిర్మాల్యాన్ని తొలగిస్తే, తానే ఈశ్వరుడని తెలుసుకుంటాడు అజప గాయత్రి ద్వారా. కనుకనే గురుమూర్తి ఉపదేశించిన **హంసశ్శివః సోఽహమ్** అనే సూచన మంత్రం ద్వారా తాను ఈ కనిపించే అనిత్యమైన శరీరం కాదని, తాను ఆత్మ స్వరూపుడనని తెలుసుకుంటాడు. ఇదీ సాధకుడు చేయవలసిన నిజమైన జపం. ఇది తన ప్రమేయం లేకుండానే, అహర్నిశలు ఉచ్ఛ్వాస నిశ్వాసల ద్వారా జరిగిపోతుంది. దానినే అజపగాయత్రి అంటారు. **సోహమ్ భావేన పూజయేత్** కొలికిపూస ఎప్పుడు వస్తుందా, అని గడియారంవైపు మాటిమాటికి దృష్టి సారించే జపాలు మనకు ఎటువంటి అనుభూతిని ఇవ్వవు. ఎన్ని వేలు అని లెక్కల జపాలు కూడా అంతే.

మనలో సహజంగా జరుగుతున్న అజపగాయత్రికి ఫుల్‌స్టాప్ అన్నదే లేదు. అజపగాయత్రితో తమ ఆయుర్దాయాన్ని కూడా పెంచుకోవచ్చు అని శ్రీగురుదేవులు చెప్పారు. ఆ విధంగానే వశిష్ఠులవారు తమ ఆయుర్దాయాన్ని శ్రీరామచంద్రుడి అవతరణ కోసం పొడిగించుకున్నారట. మనం అంత చేయలేమని, 'మీ హృదయంలో వున్న గురుమూర్తిపై మీ దృష్టి నిలపండి చాలు. నీ గురుమూర్తిపై దృష్టి పెట్టి కుంభించు' అన్నారు.

- సశేషం



# దైవం మానుష రూపేణ

-ఎన్. కుట్టీ

భగవంతుడు తనలో తాను ఇలా అనుకుంటున్నాడు. 'నేను ఎన్నో అవతారాలు ఎత్తాను, ఎన్నో లీలలు చూపించాను. ఎన్నో ధర్మాలు చెప్పాను. గురు రూపంలో వచ్చాను. గురువు అంటే ఎవరో తెలిపాను. గురువును ఆశ్రయించిన వారు తప్పక ఉద్ధరింపబడతారని చెప్పాను. కానీ ఈ మానవులు మారటం లేదు. నేను సృష్టించిన ప్రపంచమే కదా ఇది. ఈ మానవులంతా నా అనుగ్రహం వలన పుట్టిన వారే కదా! ఈ జంతుజాలములన్నీ నేనే కదా! ద్వాపర యుగంలో, త్రేతాయుగంలో నా అంశలను, నా గురించి తెలిపాను. అయినా ఇంకా నన్ను గురించి తెలుసుకోకుండా వున్నారు. ఈ కలియుగంలో మానవులు ధర్మాధర్మాలు తెలియకుండా, అవినీతి పరులై, భగవంతుని లెక్కచేయకుండా, విచ్చలవిడిగా అసలు సంగతినే మరచి, నేను ఎవరని తెలుసుకోలేక, ఈ జీవితమే పరమావధిగా బ్రతుకుతున్నారు. నాకు తప్పదు! ఇహ నేను మరల అవతారం ఎత్తి, ఈ నేను ఎవరో తెలియజేయాలి' అనుకుని శ్రీమహావిష్ణువు భూలోకంలో అవతరించుటకు పూనుకున్నారు. తను సంకల్పించినట్లు భూలోకంలో అపరిచితుడై జన్మించాడు.

అది ఒక కుగ్రామం. ఆ గ్రామంలో నన్నయ్య భట్టు అనే ఒక పేద బ్రాహ్మణుడు, అతని భార్య నివసిస్తూ వుండేవారు. నన్నయ్యభట్టు గొప్ప భక్తుడు. ఆ గ్రామంలో చాలా మందికి భగవంతునిపై ఎక్కువ నమ్మకం లేదు. నన్నయ్య భట్టుకు వేరే వారితో పనిలేదు. తన భార్య పిల్లలను కూడా ఆ భగవంతుడే చూసుకుంటాడని ఆ భారం భగవంతుని పైన వుంచి, ఎప్పుడూ ధ్యానం చెయ్యడంలోనే నిమగ్నమై వుండేవాడు. ఈ జన్మలోనే తనకు భగవంతుని దర్శనం అవుతుందని అతని ప్రగాఢ విశ్వాసం.

అనుకోకుండా నన్నయ్యభట్టుకు ఒక అపరిచితుడు స్నేహితుడయ్యాడు. 'నీ పేరేమిటి? ఏ వూరు మీది?' అని అడిగాడు నన్నయ్య. అతను 'నా పేరు నారాయణుడు, మాది నారాయణపురం' అన్నాడు. 'నేనెప్పుడూ ఆ ఊరిపేరు వినలేదే!' అన్నాడు నన్నయ్య. అతను 'అది నీకు తెలియదులే. ఆ పురం చాలా దూరంలో వున్నది' అన్నాడు.

‘నీ భార్య పేరేమిటి?’ అడిగాడు నన్నయ్య. అతను ‘లక్ష్మి’ అన్నాడు. అది విని నన్నయ్య చాలా ఆశ్చర్యంగా చూస్తూ ‘నీ పేరు, నీ భార్యపేరు, మీ ఊరు పేరు భలే గమ్మత్తుగా వున్నాయి! అన్నీ దేవుడి పేర్లే!’ అన్నాడు.

‘ఏ పేర్లు అయితే ఏముందిలే! మన స్నేహం చిరకాలం వర్ధిల్లాలి. ప్రతియుగంలో భగవంతుడు మానవ దేహాన్ని ధరించి మానవాళిని ఉద్ధరించడానికి అవతారం ఎత్తుతూ వుంటాడు. చూశావా నన్నయ్యా! ఈ ఊరి ప్రజలందరికీ ఎప్పుడూ డబ్బు మీదే ఆశ. భార్య బిడ్డల మీద మమకారం, బంధు మిత్రుల మీద ప్రేమ, ఈర్ష్య, అసూయ, ద్వేషాలతో సతమతమవుతున్నారు. భగవంతుడి మీద ధ్యాసే లేదు. మానవజన్మ వచ్చింది ఎందుకు? ఎన్నో జన్మలు ఎత్తితేగానీ ఈ మానవజన్మ రాదు. అసలైన నేను తెలుసుకోలేక ఈ మానవులంతా ఎలా పాడైపోతున్నారో!’ అన్నాడు నారాయణ.

నన్నయ్య మాట్లాడుతూ ‘అవును మిత్రమా! నీవు చెప్పినది అక్షరాలా నిజం. అయితే కానీ, మనకెందుకు మధ్యలో. కాకి బాధ కాకిది, పీత బాధ పీతది’ అన్నాడు.

- సశేషం

**పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు**

*** ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును***

**జులై 2023**

3 సోమ - ఆషాఢ(గురు)పూర్ణిమ - శ్రీ సద్గురుపాదపూజ

12 బుధ - శ్రీ గురుదశమి - శ్రీ సద్గురు పాదపూజ

**ఆగస్ట్ 2023**

1 మంగళ - అధిక శ్రావణ పూర్ణిమ - శ్రీసద్గురుపాదపూజ

10 గురు - శ్రీ గురుదశమి - శ్రీసద్గురు పాదపూజ

31 గురు - శ్రావణ (రాఖీ) పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ.

# అగస్త్య హృదయం

(గత సంచిక తరువాయి) - వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

**అథరవిరవదన్నిరీక్ష్య రామం ముదిత**
**మనాః పరమం ప్రహృష్యమాణః**
**నిశిచరపతి సంక్షయం విదిత్వా**
**సురగణ మధ్యగతో వచస్త్వరేతి॥**

తాత్పర్యము: అటు పిమ్మట సూర్యభగవానుడు ఎంతో సంతోషమును పొందినవాడై రావణుడు నశించుట తథ్యమని ఎఱిగి శ్రీరాముని చూసి "రామా - త్వరపడు" అని పలికెను.

ఆదిత్యహృదయములో చివరిదైన ఈ శ్లోకము తలమానికమైనదిగా చెప్పుకోవచ్చు. ఎందుకంటే గురుదేవులైన అగస్త్యులు వుపదేశించిన మంత్రమును ఉపాశించిన శ్రీరామునికి సాక్షాత్కారమైన ఆదిత్యుని, ఆయన పలికిన పలుకులను ఈ శ్లోకం వివరిస్తోంది. సాధకుడిని పరమాత్మతో అనుసంధానం చేసే గురుశక్తిని ఆవిష్కరించే అద్భుతమైన ఘట్టమది.

**"అథరవిః ముదితమనాః పరమం ప్రహృష్యమాణః రామం నిరీక్ష్య"** అంటూ వాల్మీకి మహర్షి పరమానందంతో శ్రీరాముని వైపు చూస్తున్న ఆదిత్యుని దర్శింపజేస్తున్నారు. సాధకుడు తన దీక్షలో పరిపూర్ణత చెందటం ఆ సాధకునికే కాక భగవంతుడికి కూడా ప్రీతికరమని ఈ ప్రస్తావన నిరూపిస్తోంది. అలా పరిపూర్ణత చెందిన తరువాత ఆదిత్యుని చూసి ఆనందించిన శ్రీరాముడు (**ఆదిత్యం ప్రేక్ష్య జప్త్వాతు పరం హర్షమవాప్తవాన్**) రావణుని చూసి కూడా వ్యాకులత చెందక అదే ఆనందముతో (**రావణం ప్రేక్ష్య హృష్టాత్మా**) వున్నాడు. ఆ ఘట్టమును వీక్షించిన ఆదిత్యులు ఆనందము పొందటము మరి సర్వులకూ హర్షమును ప్రసాదించగల గురుదేవుల శక్తియే కదా! సాధకులైన మనందరికీ అటువంటి హర్షమును ప్రసాదించ గలిగిన సమర్థసద్గురు శ్రీ బాబూజీ మహరాజ్‌ను మనం ప్రేమతో **ఓం సర్వహర్ష ప్రదాయకాయ నమః** అని స్తుతించుకొంటాము కదా!

**నిశిచరపతి సంక్షయం విదిత్వా** అంటూ మహర్షి వెనువెంటనే జరుగనున్న రావణుని వధనే కాక జ్ఞానమునకు అవరోధమైన తమస్సుకు ప్రతీకలైన కామక్రోధాది శత్రు సంహారమును తెలియజేస్తున్నారు.

**వేదాహమేతం పురుషం మహాంతం ఆదిత్యవర్ణం తమసస్తు పారే** అన్న విధముగా గురుదేవుని, వారి కృపతోనే, పెంజీకటికావల వెలిగే పరం జ్యోతిగా, పరమ పురుషునిగా గుర్తిస్తాడు. చివరకు తనకూ, తన గురుదేవునికీ అభేదమనే స్వస్వరూప జ్ఞానమును పొందగలుగుతాడు. ఆ జ్ఞానమును కేవలం గురుమూర్తి మాత్రమే ప్రసాదించగలరు. అలాంటి జ్ఞానమును మనకు ప్రసాదించగలిగిన శ్రీబాబూజీ మహరాజ్‌ను మనం **ఓం స్వరూపజ్ఞాన కోవిదాయ నమః** అని తలచుకొంటాము.

**సురగణ మధ్యగతో వచః 'త్వర' ఇతి** అంటూ దేవతా గణముల మధ్య విరాజిల్లుతూ సత్వరమే రావణుని వధించమన్న ఆదిత్యుని పలుకులలో **అంత్యకాలేచ మామేవ స్మరన్ ముక్త్వా కలేవరం** అని గీతాచార్యులు చెప్పినట్లు జాగుచేయక ఈ క్షణమే నీదని ఎఱిగి త్వరపడమని సాధకులందరికీ గురుదేవులు చేస్తున్న హెచ్చరికగా గుర్తించాలి.

పై విధముగా ఈ శ్లోకం ద్వారా ఆదిత్యహృదయమునకు అధిష్ఠాన దేవతయైన సూర్యభగవానుని పలుకుల ద్వారా సాధకులందరికీ వుండవలసిన అప్రమత్తతను గుహ్యముగా వివరిస్తున్నారు.

- సశేషం



# పండు

- పాలూరి కాళీప్రసాద్

పూర్వం ఒక అడవిలో ఒక గురువుగారు ఆశ్రమం నిర్మించుకొని నివసించేవారు. ఆయన వద్ద కుమార్, మోహన్, ఈశ్వర్ అని ముగ్గురు శిష్యులు ఉండేవారు. ముగ్గురికీ గురువుగారంటే ఎంతో భక్తిశ్రద్ధలు వుండేవి. శ్రద్ధాతత్పరతలతో గురుసేవ, ఆశ్రమసేవ చేసుకొనేవారు. తన కర్తవ్యంలో భాగంగా కుమార్ గురువుగారితో కలిసి వారి కుటీరంలోనే నివసిస్తూ రోజంతా వారికి ఎప్పుడు ఏ సేవ అవసరమో కనిపెట్టుకొని నిర్వహించేవాడు. ఇక మోహన్, ఈశ్వర్ వేరే కుటీరంలో ఉంటూ ఆశ్రమ నిర్వహణకు కావలసిన పనులన్నీ చేస్తూ ఉండేవారు.

నిరంతరం గురువుగారి సమీపంలో ఉండటంతో తనంటే గురువుగారికి ఎంతో ఇష్టమని, తన మాట ఆయన తప్పక వింటారని కుమార్‌కి కొంచెం గర్వం కూడా ఉండేది. అలాగే ఇదే విషయంలో మిగిలిన ఇద్దరికీ అతనంటే అసూయగా ఉండేది. ఇప్పటిలాగా సెల్‌ఫోనులు లేకపోవడంతో వీరు ముగ్గురూ రోజూ రాత్రి భోజనానంతరం ఆశ్రమంలో అరుగుమీద కూర్చొని పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ ఉండేవారు. ఆ మాటల సందర్భంలో 'గురువుగారు ఈరోజు నన్ను నవ్వుతూ ఎంతో ప్రేమగా పలుకరించార'ని ఒకరు, 'నావైపు కోపంగా చూశార'ని ఒకరు, 'గురువుగారు నేను చేసిన వంకాయకూర ఇవాళ ఎంతో ఇష్టంగా తిన్నార'ని ఒకరు, ఇలా సంభాషణ సాగుతుండేది.

ఆశ్రమవాసం చేస్తూ, తమ తమ సాధన పురోగతిని గూర్చి ఆలోచించకుండా శిష్యులు ఇటువంటి విషయాలను చర్చిస్తూ ఉండటం గురువుగారు గమనించారు. ఒకరోజు వారి ముగ్గురినీ తమ ఆశ్రమంలోని మామిడిచెట్టు వద్దకు పిలిచి, పచ్చిగా ఉన్న మామిడికాయ కోసి తినమన్నారు. తిన్న తరువాత 'మీరు ఏమి గమనించారు?' అని అడిగారు గురువుగారు. కుమార్ 'ఈ మామిడికాయ చాలా పుల్లగా ఉందండీ' అన్నాడు. మోహన్ 'లేదండీ, ఇది వగరుగా ఉంది' అన్నాడు. ఇక ఈశ్వర్ 'ఈ కాయ కోసినపుడు చాలా సొన కారిందండీ' అన్నాడు.

గురువుగారు మరొక పచ్చికాయను చూపించి 'దానిని రోజూ గమనిస్తూ ఉండండి' అని ఆదేశించారు. ముగ్గురు శిష్యులూ ఆ కాయను రోజూ గమనిస్తున్నారు. కొన్నాళ్లకి అది మెల్లిగా పండి బంగారు రంగులోకి మారి ఒకరోజు ముట్టుకోగానే చెట్టునుండి ఊడి చేతిలోకి వచ్చేసింది. వెంటనే శిష్యులు ముగ్గురూ దానిని తీసుకొని పరిగెత్తుకుంటూ గురువుగారి వద్దకు చేరారు. ఆ పండును చూసిన గురువుగారు 'ఏదీ, ఇప్పుడు దీనిని తిని చూడండి' అన్నారు. ముగ్గురూ దానిని తిని ఏకకంఠంతో 'ఇది ఎంతో తియ్యగా ఉంది గురువుగారూ!' అన్నారు. ఈశ్వర్ తాను ఇంతకు ముందు చెప్పిన మాటను గుర్తు తెచ్చుకుంటూ 'ఈ పండు చెట్టునుండి దానంతటదే విడిపోయిందండీ. పైగా సొన కూడా కారలేదు' అన్నాడు ఆశ్చర్యంగా.

'చూశారా మరి! మానవుడు కూడా ఈ మామిడి పండు లాంటివాడే. పచ్చిగా ఉన్నప్పుడు కామ క్రోధాది గుణాలతో పుల్లగా, వగరుగా వున్న మామిడి కాయలాగే ఉంటాడు. సంసార వృక్షాన్ని వదలాలంటే సొన కార్చినట్టుగా ఏడుస్తాడు. అదే ఆత్మజ్ఞానంతో ఒకసారి పండిన మానవుడు మధుర స్వరూపుడై సంసారం నుండి తనకు తానుగా విడిపోతాడు' అని వివరించిన గురువుగారు 'మరి మీలో ఎవరైనా ఈ పండుని మళ్ళీ కాయగా మార్చగలరా?' అని ప్రశ్నించారు. శిష్యులందరూ ఏకకంఠంతో 'అదెలా సాధ్యం గురువుగారూ? అది జరిగే పని కాదు' అన్నారు.

'మరి మీరు నన్ను ఆత్మజ్ఞానం పొందిన పండునని అనుకుంటున్నారా, లేక ఇంకా పచ్చిగా ఉండి సంసారాన్ని విడువలేని సామాన్య మానవుడనని అనుకుంటున్నారా?' అని ప్రశ్నించారు గురువుగారు. ఊహించని ఈ ప్రశ్నకు ఖంగుతిన్న శిష్యులు 'మీరు ఆత్మజ్ఞాన సంపన్నులయిన సిద్ధ పురుషులనే మా అందరి నిశ్చితాభిప్రాయం స్వామీ!' అని సమాధానమిచ్చారు. 'మరి అటువంటి గురువుకు ఇంకా ఇష్టాయిష్టాలు, రాగద్వేషాలు, ఒకరంటే ప్రేమ, మరొకరంటే కోపం ఇలాంటి గుణాలు ఉంటాయని ఎందుకు అనుకుంటున్నారు?

గురువు స్వచ్ఛమైన అద్దంలాంటివాడు. మీ హృదయంలో ఏ భావన ఉంటుందో గురువునుంచి ఆ విధమైన ప్రతిస్పందనే వచ్చినట్లుగా మీకు కనిపిస్తుంది. మీలో ప్రేమ, భక్తి ఉప్పొంగితే గురువు కూడా మిమ్మల్ని ప్రేమించినట్లుగా, ఆదరించినట్లుగా కనిపిస్తారు. మీలో ఏదైనా తప్పు చేశాననే అపరాధ భావన దాగి ఉంటే గురువుగారు మిమ్మల్ని కోపగించుకున్నట్లుగానే కనిపిస్తారు. లోపం, చూసే వ్యక్తిలోనిదే కానీ అద్దానిది కాదు.

అంతే కాదు. మీరందరూ నాలోని భాగాలే. అలాగే నేను మీ అందరిలో ప్రకాశించే ఆత్మవస్తువునే కదా! **మత్తః పరతరం నాన్యత్ కించిదస్తి ధనంజయ, మయి సర్వమిదం ప్రోతమ్ సూత్రే మణిగణాయివ** అని గీతాచార్యుడు చెప్పినట్లు ఆత్మజ్ఞానియై, భగవత్స్వరూపుడైన గురువుకన్నా భిన్నమైనది ఈ ప్రపంచంలో ఏ ఒక్కటీ లేదు. మణిమాలలో మణులన్నీ దారంతో ఎలా అనుసంధానించబడి ఉన్నాయో ఈ ప్రపంచమంతా గురువు(భగవంతుని)తో అలా అనుసంధానించబడి ఉంది. మీ శరీరంలో ఒక అవయవాన్ని ఎక్కువగా ప్రేమించి మరొకదాన్ని ద్వేషించరు కదా! ఆ అవయవాలన్నీ మీకు సమానమే కదా. అలాగే మీరందరూ నాకు సమానులే. కాబట్టి మీలో మీరు ఎక్కువ తక్కువలు కల్పించుకొని, ఆ భేదభావాలను నాకు కూడా ఆపాదించి, మీ ఆశ్రమవాసాన్ని వ్యర్థం చేసుకోకుండా, సమదృష్టి కలిగి ఉండి, చక్కగా సాధన చేసుకొని తరించడానికి ప్రయత్నించండి' అని బోధించి వారికి కనువిప్పు కలిగించారు గురువుగారు.

**గురువు నవ్వెనని గురువు తినెనని**
**నన్నె మిన్నగా ఇష్టపడునందువు**
**పండెన్నడైన మరల కాయౌనె**
**కాళీ ప్రసాదు మాట కాంతిబాట॥**

# సంసారపంకనిర్మగ్న సముద్ధరణ పండితా

- భాగవతుల హనుమత్ జయప్రద

**సంసారపంకనిర్మగ్న సముద్ధరణపండితా** (సంసారమనే బురదలో నిర్మగ్నమైన జనులను సముద్ధరించే పండితురాలు -శ్రీ లలితా సహస్రనామం)

జగన్మాత నిలయమైన కమలం (తామర పువ్వు) అడుసు (బురద) నుండి ఉధ్భవిస్తున్నప్పటికీ  దాని వలన కొంచెం కుడా మాలిన్యము పొందకుండా తన తలను జలాల పైకెత్తి నిర్మలమైన వాతావరణంలో తేలియాడుతూ ఉంటుంది. అలానే మహనీయులు సంసారంలో మెలుగుతూనే సంసార పంక నిర్మగ్నులు కాక, ఎప్పుడూ కూడా బ్రహ్మానందాన్నే అనుభవిస్తూ, పరమహంస స్వరూపులై ఉంటారు. అది మహాత్ములు, కారణ జన్ముల యొక్క నిజమైన స్థితి. మరి సాధారణ మనుష్యుల సంగతి ఏమిటి? సాధారణ మనుష్యుల కోసం ఆ అమ్మయే ఒక సద్గురువు రూపం దాల్చి, మన కర్మ వాసన అనే బురదని సమూలంగా  కడిగివేస్తుంది.

భక్తుడు: భగవంతుడు మమల్ని ఈ సంసారంలోకి ఎందుకు దింపాడు?

శ్రీ రామ కృష్ణ పరమహంస: సంసారం కర్మ క్షేత్రం. కర్మల ద్వారా జ్ఞానాన్ని సముపార్జించవచ్చు. చేయదగిన కర్మలు, చేయరాని కర్మలని గురువు ఉపదేశిస్తారు. అంతేగాక నిష్కామ కర్మ చెయ్యవలసిందిగా  గురువు బోధిస్తారు. భగవంతునియందు మనసుపెట్టి కర్మ చేసేకొద్ది మనోమాలిన్యం నశిస్తుంది.

భక్తుడు: భగవంతుడు మనల్ని సంసారం నుండి ఎందుకు విముక్తుల్ని చేయలేకున్నాడు?

శ్రీ రామకృష్ణ పరమహంస: కామిని, కాంచనాల మీద కోరిక వదిలి పోయినప్పడు మనల్ని అయన విముక్తుడిని చేస్తాడు.

ఆధ్యాత్మిక ప్రపంచంలో ప్రాపంచక విషయాలకు సంబంధించి శ్రీ రామకృష్ణులు ఇచ్చిన ఉపమానాలు కోకొల్లలు. శ్రీ రామకృష్ణులు అతి సాధారణమైన విషయాలను ఆధ్యాత్మిక విషయాలకి అన్వయిస్తూ వుండేవారు. సంసారంలో ఉంటూనే భగవంతుని వైపు మనసుని ఎలా ఊన్చుకోవడం? ఒక ఉదాహరణ చూద్దాం .

ఇంట్లో ఒక పని మనిషి పనిచేస్తోంది అనుకోండి, తాను పని చేస్తున్నంత సేపూ అక్కడ ఉన్నవారు అందరూ కూడా తనవాళ్ళే అన్నట్టుగా ఉంటుంది. తన ఇల్లే అన్నట్టుగా పని చేస్తుంది. కానీ తన మనసు అంతా కూడా తన నిజమైన పిల్లలయందు, తన స్వంత ఇంటియందు వుంటుంది. పైకి ఎక్కడా కనిపించక పోయినా కూడా, మనము కూడా ఈ ప్రపంచంలో ఉంటున్నప్పుడు మన మనసును ఆ విధంగా పెట్టగలగాలి.

ఒకసారి మహేంద్రనాథ్ గుప్తాతో శ్రీ రామకృష్ణులు అంటారు, “నీవు నాకొక మంచి చిత్రపటం తీసుకుని రాగలవా?” అని. “అది ఎటువంటిది అయ్యి ఉండాలి అంటే, పక్షి తన గుడ్లను పొదుగుతున్నట్టు ఉండాలి. అలాంటి చిత్రపటం కావాలి” అని. అది ఒక అద్భుతమైన దృశ్యం. పక్షి గుడ్లను పొదుగుతున్నప్పుడు దాని దృష్టి ఎలా వుంటుందో మనం గమనిస్తే, దాని కళ్ళు చూస్తూనే ఉంటాయి కానీ దాని దృష్టి మాత్రం లోపల ఆ గుడ్ల పైనే వుంటుంది. మొట్టమొదటిసారి శ్రీ వివేకానందులు, రామకృష్ణుల దర్శనానికి వచ్చినప్పుడు, ఆయన వచ్చిన తీరుని శ్రీ రామకృష్ణులు వర్ణిస్తారు. “నరేంద్రుడు లోపలికి వచ్చినప్పుడు ఆయన కళ్ళను చూసి నేను ఆశ్చర్యపోయాను. ఎందుకంటే ఆ కళ్ళు మాములుగా ప్రపంచాన్ని చూస్తున్నప్పటికీ, అతని దృష్టి, ఊర్ధ్వదృష్టి కలిగి ఉంది. ఈ కలకత్తా మహానగరంలో ఇలాంటి వారు కూడా ఉన్నారా?” అని అన్నారట.

ఒకానొక  కాలంలో ఒక రాజ్యంలోని ప్రజలు ఇలా తమయొక్క రాజుని నిర్ణయించుకుంటారు. “ప్రతి 5 సంవత్సరాలకు మనము మన రాజుని మార్చాలి” అని. ఒకవేళ 5 సంవత్సరాలు అయ్యాక కూడా ఆ రాజు సింహాసనాన్ని వదిలి వెళ్ళకపోతే, ఆ రాజుని ఆ ప్రజలే తరిమి కొట్టేవారు. ఇది ఆ రాజ్యంలో ఆచారంగా వస్తోంది. అలా కొందరు రాజుల పాలన అయ్యాక, ఒకానొక రాజు వంతు వచ్చింది. అయన 4 సంవత్సరాల 11 నెలలు అవ్వగానే ఒక విచిత్రమైన ప్రకటన చేసాడు. “నేను రేపు రాజ్యం వదిలి వెళ్ళిపోతున్నాను” అని. ప్రజలు అందరు ఆశ్చర్యపోతారు. మరుసటి రోజు, ఆయన తన భార్య, బిడ్డలతో ఆ రాజ్యం వదిలి, బయట ఉన్న భవంతిలోకి వెళ్ళిపోయి అక్కడ ఉంటారు.

- సశేషం

# ధ్యానానికి మించిన తీర్థయాత్ర లేదు!

- వాట్సాప్ ఆర్టికల్స్ నుండి

వేదాంతంలో కస్తూరిమృగం కథ చెబుతారు. అంటే అది ఒక రకమైన జింక. సీజన్ వచ్చినప్పుడు దాని బొడ్డునుండి ఒక రకమైన ద్రవం ఊరుతూ వుంటుంది. అది మంచి మదపు వాసనగా వుంటుంది. అప్పుడు ఆ వాసన ఎక్కడినుండి వస్తున్నదా అని జింక వెతకడం మొదలు పెడుతుంది. ఆ వాసన తన దగ్గరనుండే వస్తున్నదని అది గుర్తించలేదు. ఆ అన్వేషణలో అది అలా అడవి అంతా తిరిగి తిరిగి చివరకు ఏ క్రూరమృగం నోట్లోనో పడిపోతుంది. ప్రాణాలు కోల్పోతుంది. వేదాంత గ్రంథాలలో వున్న ఈ కథ అందరికీ తెలిసినదే.

మనిషి కూడా తనలోనే వున్న ఆత్మను తెలుసుకోలేక, లోకమంతా ఇలాగే వ్యర్థంగా తిరుగుతూ వుంటాడు. పుణ్యక్షేత్రాలనీ, తీర్థయాత్రలనీ అనవసరంగా తిరిగి కాలాన్నీ, ధనాన్నీ వృథా చేసుకుంటాడు. నిజంగా వీటివల్ల పెద్దగా ఆధ్యాత్మిక ప్రయోజనం అంటూ ఏమీ వుండదు.

పాండవులు తీర్థయాత్రలకు వెడుతూ కృష్ణుణ్ణి కూడా తమతో రమ్మనమంటారు. సాక్షాత్తు భగవంతుడే అయిన శ్రీకృష్ణునికి తీర్థయాత్రలతో పని ఏముంది? ఆ సంగతి మాయామోహితులైన పాండవులకు తెలియదు. కనుక కృష్ణుణ్ణి కూడా తమలాగే మానవ మాత్రునిగా భావించి తీర్థయాత్రకు తమతో రమ్మనమని పిలుస్తారు. ఆయన ఒక చిరునవ్వు నవ్వి, వారికి ఒక దోసకాయ ఇచ్చి, 'నా ప్రతినిధిగా మీరు దీనిని తీసుకువెళ్ళి, మీరు మునిగిన ప్రతి గంగలోనూ దీన్ని కూడా ముంచండి' అని చెప్పాడు. వారు అలాగే చేసి తీర్థయాత్రలు పూర్తి చేసుకుని తిరిగి వచ్చారు.

అప్పుడు ఏర్పాటు చేసిన విందు భోజనంలో ఆ దోసకాయనే కూరగా వండించి అందరికీ వడ్డించాడు. ఆ కూర పరమచేదుగా వుంది. 'అదేమిటి బావా! ఇది పరమ చేదుగా వుంది. ఇలాంటి వంటకం చేయించావేమిటి?' అని అడిగారు ఆశ్చర్యంగా పాండవులు. దానికి శ్రీకృష్ణుడు అదే చిరునవ్వుతో 'పార్థా! ఎన్ని గంగల్లో మునిగినా ఈ దోసకాయ చేదు పోలేదు చూశావా?' అన్నాడు.

అంటే, ఎన్ని తీర్థయాత్రలు చేసినా మనిషిలో మౌలికంగా ఎటువంటి మార్పూ రాదు అని కృష్ణుడు ఈ సంఘటన ద్వారా వారికి సూచించాడు. ఆధ్యాత్మిక జీవితంలో ఇది అత్యున్నతమైన సత్యం.

మనిషి ప్రయాణం బయటకు కాదు, లోపలికి జరగాలి. యాత్ర అనేది బయట కాదు, ఆంతరంగిక యాత్ర చేయాలి మానవుడు. మనిషి ప్రపంచమంతా తిరిగినా చివరకు ఆధ్యాత్మికంగా ఏమీ సాధించలేడు. అదే తనలోకి తాను ప్రయాణం చేస్తే వున్న గదిలో నుండి కదలకుండానే జ్ఞానాన్ని సంపాదించవచ్చు. పూర్వపు మహర్షులు దేశాలు పట్టుకుని ఎప్పుడూ తిరగలేదు. ఒకేచోట స్థిరంగా కూర్చుని తపస్సు చేశారు. తపస్సు అంటేనే ధ్యానం. ధ్యానం ద్వారానే వారు జ్ఞాన సిద్ధిని పొందారు.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**కార్యక్రమాలలో ఏమైనా మార్పులు వుంటే ఎప్పటికప్పుడు హైదరాబాద్‌శాఖవారి వాట్సప్ గ్రూప్‌లో తెలుపబడును......**

**జులై 2023**

3 సోమ - ఆషాఢ(గురు) పూర్ణిమ - సా. 5-30గం. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్త సమారాధన.

12 బుధ - శ్రీ గురుదశమి - సా. 5-30 సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్త సమారాధన.

**ఆగస్ట్ 2023**

1 మంగళ - అధిక శ్రావణ పూర్ణిమ - సా. 5-30 సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్త సమారాధన.

10 గురు - శ్రీగురుదశమి - సా. 5-30 సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్త సమారాధన.

31 గురు - శ్రావణ (రాఖీ) పూర్ణిమ - సా. 5-30 సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్త సమారాధన.



గులాబీ కంపు
ముకుంద్
నువ్వు అబద్ధాలు ఆడతావా రమణా?
ఆడనండి. ఒక వేళ ఆడితే మా మావయ్య ఊరుకోరండి .
సరే, పందెమా? నేను నువ్వు అబద్ధం ఆడేలా చేస్తాను. ఆ గులాబీ మొక్క లోంచి ఒక పువ్వును కోసి నేను అడిగిన ప్రశ్నలకు నిజం చెబితే పటికబెల్లం ఇస్తా.
1




సరేనండి. ఒక వేళ నేను ఓడిపోతే 10 గుంజీలు తీస్తానండి.
2


వాసన ఎలా
ఉంది నాయనా?
వాసన బాగా
ఉందండీ.
3


మళ్ళీ వాసన
చూసి చెప్పు.
4


ఏంటి నాయనా?
పువ్వుని పడేసావు.
ఛీ! కంపు
కొడుతోందండీ!
కంపు చేతికి
కూడా
పట్టిందండీ!
5


ఇదిగో. ఈ నీళ్ళతో
చేతులు కడుక్కో.
6


అసలు మీరు పువ్వు వాసనని ఎలా మార్చారండి?
నేనేమీ చెయ్యలేదు. అంతా ఆ జగన్మాత మాయే! మాటలు నాతో చెప్పిస్తారు, పని మొత్తం ఆవిడే చేస్తారు.
7


లేదండి. ఇదంతా చేసేది మీరే బాబూ! జై సద్గురు మహరాజు కీ జై!
8

# గెహనీ నాథులు

సేకరణ - మురళి

కనకగిరి గ్రామంలో మశ్చేంద్రనాథులు గోరక్షనాథునికి ఉపదేశం చేసి, సకల వేదాలలో ప్రావీణ్యత పొందేలాగున, చతుర్దశ విద్యలను బోధించారు. సకల అస్త్రాలను, శబరి విద్యను బోధించి, దేవతల పాదాలపై ఉంచారు. శ్రీరాముడు, సూర్యుడు మొదలైన దేవతలంతా గోరక్షనాథునికి వరములు ఇచ్చి ఆశీర్వదించారు.

ఒకరోజు గోరక్షనాథుడు ఏకాంతముగా సంజీవని మంత్రం జపిస్తూ కూర్చున్నాడు. మశ్చీంద్రనాథులు దగ్గర లేరు. గ్రామంలోని పిల్లలు ఆడుకుంటూ అతని వద్దకు వచ్చి, మట్టితో బండిని చేసి యివ్వమని అడిగారు. గోరక్షనాథుడు చెయ్యలేనని చెప్పగా పిల్లలు స్వయంగా వారే మట్టిబండి తయారుచేశారు.

బండి నడిపేవానిని తయారుచేసి యివ్వమని పిల్లలు గోరక్షనాథుని ప్రాధేయపడ్డారు. వారి అభ్యర్థనను అంగీకరించి మట్టితో విగ్రహాన్ని తయారు చేయడం ప్రారంభించాడు. గోరక్షనాథుడు సంజీవని మంత్రం జపిస్తూనే మట్టి ప్రతిమను తయారుచేసాడు. ప్రతిమ పూర్తవగానే నరనారాయణులలోని కర్భంజనుడు అందులో ప్రవేశించాడు. అప్పుడు ఎముకలు, చర్మం, మాంసం, రక్తం మొదలైనవన్నీ వాటంతటవే ఏర్పడ్డాయి. తర్వాత ఆ ప్రతిమలోని బాలుడు ఏడవడం మొదలుపెట్టాడు. ఈ శబ్దం పక్కనే ఉన్న పిల్లలు విని భయంతో అందరూ పారిపోవటం మొదలుపెట్టారు. వారికి దారిలో మశ్చీంద్రనాథులు ఎదురై వారు ఎందుకు భయపడుతున్నారని అడిగారు. ఆ పిల్లలు జరిగిన విషయాన్ని చెప్పారు. ఆశ్చర్యపోయిన మశ్చీంద్రనాథులు పిల్లలను తన దగ్గర కూర్చోబెట్టుకుని వివరాలన్నీ మరొకసారి అడిగి తెలుసుకున్నారు.

మశ్చీంద్రనాథులు ఆ పిల్లవాడిని చూడగానే ఈ కర్భంజనుడు శ్రీమన్నారాయణుడి అవతారమని గ్రహించారు. మశ్చీంద్రనాథులు గోరక్షనాథునితో కలిసి ఆ పిల్లవాడిని తన ఆశ్రమానికి తీసుకుని వెళ్ళి గెహినీనాథుడు అని నామకరణం చేశారు. గ్రామ ప్రజలు అందరూ వచ్చి ఆ బాలుని చూసి ఆశ్చర్యపోయారు. మశ్చీంద్రనాథులు తీర్థయాత్రలకు వెళ్తూ ఆ బాలుని కూడ తీసుకుని వెళ్ళాలనుకున్నారు.

గ్రామ ప్రజలంతా ఆ పిల్లవాడికి తల్లిదండ్రుల రక్షణ కల్పిస్తే బాగుంటుందని సూచించారు. మశ్ఛీంద్రనాథులు కూడా ఆ సూచనకు అంగీకరించి, ఎవరికి అప్పగించాలా అని చూశారు.

గ్రామస్థులు ఆ ఊరిలో నివశిస్తున్న మధునాభుడు-గంగ అనే బ్రాహ్మణ దంపతులకు పిల్లలు లేరని, వారు ఈ పిల్లవాడిని పెంచగలరని సూచించారు. మశ్ఛీంద్రనాథులు సంతోషంగా పిల్లవానిని ఆ దంపతులకు అప్పగించి "మాతా మీ దంపతులు ధన్యులు. ఈ బాలుడు నరనారాయణులలో ఒకరైన కర్భంజనుని అవతారం. ఇతనిని జాగ్రత్తగా పెంచండి. మీరు ప్రసిద్ధి చెందుతారు, గొప్ప ధనువంతులు అవుతారు. ఇహపరాలలో మీకు ఏ లోటూ ఉండదు. పన్నెండు సంవత్సరముల తరువాత ఈ బాలుడు గోరక్షనాథుని వద్దకు చేరతాడు" అని చెప్పి గోరక్షనాథునితో కలిసి తీర్థయాత్రలకు వెళ్ళారు.

మశ్ఛీంద్రనాథులు మరియు గోరక్షనాథులు అనేక పుణ్యక్షేత్రాలను దర్శించుకుంటూ గర్భగిరి పర్వతంపై వాల్మీకి మహర్షి కొలువై ఉన్న ప్రదేశానికి చేరుకున్నారు. కఠోరమైన అడవుల గుండా ప్రయాణించడానికి మశ్ఛీంద్రనాథులు భయపడుతూ కనిపించారు. తీర్థయాత్రల సమయంలో మైనాకిని రాణి యిచ్చిన బంగారు ఇటుక వారి వద్ద వుండటం వలన దొంగలు దోచుకు వెళ్తారేమోనని భయపడుతున్నారు. ఈ భయమంతా గోరక్షనాథుని పరీక్షించడానికే, లేకుంటే మశ్ఛీంద్రనాథునికి ధనాశ ఎక్కడిది?

గోరక్షనాథులు గురువుగారి వద్ద ధనం ఉందేమో, అందుకే దొంగలు దోచుకుంటారని భయపడుతున్నారు, ఆ భయాన్ని పోగొట్టటానికి ఏదైనా పరిష్కారం చూడాలి అని భావించారు. కొంత దూరం ప్రయాణించిన తరువాత ఒక బావి కనిపించింది. తన సంచి గోరక్షనాథునికి యిచ్చి మశ్ఛీంద్రనాథులు స్నానానికి వెళ్ళారు. గోరక్షనాథులు గురువుగారి సంచిలో వారిని భయపెట్టే ధనం ఏముందా అని వెతికితే బంగారు ఇటుక కనిపించింది. దానిని దూరముగా విసిరివేసి, దానిలో ఒక రాయి పెట్టారు. మశ్ఛీంద్రనాథులు ఇక్కడి నుంచి భయం ఉండదుకదా అంటూ నడవసాగారు. కొంత దూరం వెళ్ళిన తరువాత కొండ ఎక్కవలసి వచ్చింది. మశ్ఛీంద్రనాథులు తన సంచి

చూసుకుని బంగారు ఇటుక లేకపోయేసరికి ఏడ్చి, గొడవచేసి క్రిందపడి దొర్లటం మొదలు పెట్టారు. గోరక్షనాథుని అనేక దుర్భాషలాడి, 'నీ ముఖం నాకు చూపించకు ఇక్కడినుంచి వెళ్ళిపో' అన్నారు. గోరక్షనాథులు ఏమీ పట్టించుకోకుండా గురువుగారి చెయ్యి పట్టుకుని కొండపైకి తీసుకెళ్ళారు. అక్కడ గోరక్షనాథులు సిద్ధయోగ మంత్రం జపిస్తూ మూత్ర విసర్జన చేశారు. ఆ పర్వతమంతా బంగారుమయం అయిపోయింది. గురువుగారిని మీకు ఎంత బంగారం కావాలో తీసుకోండి అన్నారు. మశ్చీంద్రనాథులు గోరక్షనాథుని అభినందించి కౌగిలించుకుని ఆశీర్వదించారు.

మశ్చీంద్రనాథులు తమ దేశానికి తిరిగి వెళ్ళిన తరువాత సాధువులకు పూజ చేసి, పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించాలని వుందని అన్నారు. గోరక్షనాథులు 'అప్పటి వరకు ఎందుకు స్వామీ ఇక్కడే ఏర్పాటు చేద్దాము' అని చెప్పి గంధర్వులను ఆవాహన చేసి వందలకొలదీ సాధువులను, మహాత్ములను తీసుకువచ్చి వారికి మంచి రుచికరమైన భోజనానికి ఏర్పాటు చేయమని కోరారు.

గురువుల కోరిక ప్రకారం గంధర్వులను పంపి గెహనీనాథులను కూడా తీసుకు వచ్చారు. ఆహూతులందరూ తృప్తిగా భోజనం చేసి వెళ్ళిన తరువాత మశ్చేంద్రనాథుల సమక్షంలో గోరక్షనాథులు గెహనీనాథులకు ఉపదేశం చేశారు. గురువులిద్దరూ గెహనీనాథులకు విద్య నేర్పించారు. ఒక్క సంవత్సరంలోనే గెహనీనాథులు సర్వ విద్యలలోనూ ప్రావీణ్యత సంపాదించారు. గెహనీనాథులు నవనాథులలో ఒకరు. అంతే కాకుండా నివృత్తినాథులయొక్క గురుదేవులు.

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

**జూలై 2023**

1 శని - మాసశివరాత్రి

3 సోమ - ఆషాఢ(గురు)పూర్ణిమ - సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ, భక్త సమారాధన

12 బుధ - శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ

15 శని - శనిత్రయోదశి

16 ఆది - మాసశివరాత్రి

17 సోమ - అమావాస్య, దక్షిణాయన పుణ్యకాల ప్రారంభం

20 గురు - అధిక శ్రావణ శుద్ధ తదియ - సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ

**ఆగస్ట్ 2023**

1 మంగళ - అధిక శ్రావణ పూర్ణిమ - శ్రీసద్గురు పాదపూజ

10 గురు - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

14 సోమ - మాసశివరాత్రి

16 బుధ - అమావాస్య

19 శని - శ్రావణ శుద్ధ తదియ - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

25 శుక్ర - వరలక్ష్మీ వ్రతం

30 గురు - శ్రావణ (రాఖీ) పూర్ణిమ - శ్రీ సద్గురుపాదపూజ, భక్తసమారాధన


## సమర్థ సద్గురు మాసపత్రిక చందావివరములు

విడి ప్రతి -10రూ,

సంవత్సర చందా -120రూ,

5 సంవత్సరాలకు - 500రూ,

జీవిత చందా (15 సం॥లకు) -1250రూ.

రాజ పోషకులు - 5,116 రూ.

మహారాజ పోషకులు - 11,116 రూ.

# మనశ్శతకము

(గత సంచిక తరువాయి)

పరశురామపంతుల లింగమూర్తి కవి

(తాత్పర్యము: కుమారి సన్నిధానం కాళీమాత)

13. **చదువు లిల బలుతెరంగుల నదరున్ దత్తరపువాని పగిది నవియెతన్**

**దుదముట్టనియవు గావున, జదువులలో జదువు రాము జదువు మనసా.**

తాత్పర్యము: భౌతికమైనవి, అనేక విధాలుగా ఉన్నవి అయిన విద్యలు మతిమాలిన వారివలె వాదనకుగాని అవి సద్గతులకు పనికిరావు. చదువులకి సారమైన శ్రీరామ సదాశ్రయము పొందుము మనసా!

14. **వేదంబులగాధంబులు, వాదంబులు బహువిధాపవాద విరచితో**

**న్మాదంబులు గావున దతేదంబుల బడక రాముని ధృతిగను మనసా.**

తాత్పర్యము: అగాధములైన వేదముల వలనగాని, ఉన్మాదములతో గూడిన అనేకములైన వాదోపవాదములుగాని, ఖేదములను ఇచ్చేవిగావున వాటిలో బడక శ్రీరాముని తరింపజేయు వానిగా తెలుసుకుని మనవలె మనసా!

15. **స్నాన జప హెూమ మంత్ర, ధ్యానాది కర్మములు మహాడంబకముల్**

**గానదలపోయకవి సీతానాధుని సర్వ సాక్షి దలపుము మనసా**

తాత్పర్యము: సర్వ సాక్షి అయిన సీతానాథుని స్థిరముగా మనస్సులో నిలుపు మనసా. స్నాన జపములు, మంత్ర ధ్యానాది కర్మలన్నీ ఆడంబరములే. అందుకని వాటియందు మనస్సు పోనీయకుము.

16. **భువి దూరదృష్టి దూర, శ్రవణాదులు మాయలని విచారింపుము స**

**త్కవివినుతుని సీతా, ధవుని యథార్థముగ నరసి తలపుము మనసా.**

తాత్పర్యము: భౌతికములైన దూరశ్రవణము, దూరదృష్టిలు మాయలే, సత్కవులైన వారు వినుతించే సీతాపతియే స్థిరమని తెలుయుము మనసా.

- సశేషం

(గత సంచిక తరువాయి)

# నిరీక్షణ

తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్

తెలుగు అనువాదం - శశికళా దివాకర్

**దేశమును వీడి, అడవి వైపుకు పయనం**

మరునాటి ఉదయం దశరథుడు తన కులగురువైన వశిష్టుని వద్దకు వెడలి, “రేపు రామునికి పట్టాభిషేకం గావించవలయును. దానికి కావలసిన ఏర్పాట్లనన్నింటినీ మీరు చూసుకొనవలయును” అన్నాడు.

**తచ్ఛ్రుత్వా భూమిపాలస్య వశిష్టో ద్విజసత్తమః।**
**ఆదిదేశాగ్రతో ర్జాః స్థితాన్ యుక్తాన్ కృతాంజలీన్॥**

దశరథుని మాటలను వినిన బ్రాహ్మణోత్తముడైన వశిష్టుడు రాజుకు రెండుచేతులు జోడించి, ప్రణమిల్లి “ రాజాజ్ఞ మేరకు అటులనే గావించెదము!” అని గంభీరంగా బదులిచ్చారు ముక్కాలములూ తెలిసిన జ్ఞానియైన వశిష్టమహర్షి. వెనువెంటనే తుఫానువేగంతో పనులన్నీ చకచక కొనసాగనారంభించాయి. వెనువెంటనే మంత్రులకు, ఇతరులకు ఇవ్విధముగ పని పురమాయించాడు

**సువర్ణాదీని రత్నాని బలీన్ సర్వౌషధీరపి॥**
**శుక్లమాల్యాంశ్చ లాజాంశ్చ పృథక్చ మధుసర్పిషీ।**
**అహతాని చ వాసాంసి రథం సర్వాయుధాన్యపి॥**
**చతురంగబలం చైవ గజం చ శుభలక్షణం।**
**చామరవ్యజనే శ్వేతే ధ్వజం ఛత్రం చ పాండురం॥**
**శతం చ శాతకుంభానాం కుంభానామాగ్నివర్చసాం।**
**హిరణ్యశృంగమృషభం సమగ్రం వ్యాఘ్రచర్మం చ॥**
**ఉపస్థాపయత ప్రాతరగ్న్యగారం మహీపతేః।**

(సూర్యాస్త సమయానికి ముందుగనే రాజుగారి యజ్ఞశాలలో సువర్ణము, వజ్రములు, పూజకు, హెూమమునకు కావలసిన సామగ్రి, దవనం, తులసి మున్నగునవి, తెల్లని పూమాలలు, మొక్కజొన్నలు, తేనె, కాచిన ఆవునెయ్యి, నూతన వస్త్రములు, రథము, ఆయుధములు, నాల్గు విధ సైన్యము, శుభసూచకములతో ఒక గజము, తెల్లటి విసనకర్ర (చామరము), జెండా ఎగురవేయు స్తంభము, తెల్లటి (ఛత్రము)గొడుగు,

ప్రకాశించు నూరు బంగారు కలశములు, తెల్లటి వృషభము మరియు సంపూర్ణ వ్యాఘ్రచర్మము మున్నగు వానినన్నింటినీ సిద్ధం చేయండి అని రాజసభలోని వారికందరికీ రాముని పట్టాభిషేక నిమిత్తమైన పనిని పురమాయించారు వశిష్టులు.)

(ఇచ్చట ఒక చిన్న విషయమును మనం గమనించవలయును. 'వశిష్టులు గణించిన ముహూర్తం వలననే రాముడు పట్టాభిషిక్తుడు కాకుండా అడవికి వనవాసమునకు వెళ్ళిపోయాడు' యని అంటుంటారు. పట్టాభిషేకమును ముహూర్త దినమును ప్రకటించినది దశరథ మహారాజేగాని వశిష్టులు కాదు అని వాల్మీకి మరియు కంబర్ తమ తమ రామాయణ కావ్యమందు సుస్పష్టంగా తెలియజేసారు.)

రాముడిని తన భవనమునకు తోడ్కొనిపోయి, "బాలకా! రేపు నీకు యువరాజ పట్టాభిషేకము గావించబోవుచున్నాను. నీవు మైథిలి (మిథిలాపుర చక్రవర్తి జనకుని కుమార్తెయైన సీత)ను తీసుకుని కులగురువైన వశిష్టుల వద్దకు వెడలి దానికి ఆచరించవలసిన నియమములన్నింటినీ తెలుసుకొనుము. వానిని ఒక పద్ధతి ప్రకారము అనుష్టించవలయును..." అన్నారు దశరథుడు. రామ పట్టాభిషేకమను వార్త దావానలంలా అయోధ్య నగరమంతటా వ్యాపించి ఆ నగరమందలి ప్రజలనందరినీ ఆనందపరవశులను గావించింది.

మహానగరమందలి కోలాహలమును గాంచి, మందర మిక్కిలి కోపగ్రస్థురాలై కైకేయియొక్క అంతఃపురములోనికి ప్రవేశించింది. "ఓసీ! బుద్ధిలేనిదానా! కొంప మునిగిపోయిందే! ఇకమీదట నీవు సవతి కౌసల్యకు దాస్యము చేయవలసిందే" యని కోపంతో రగిలిపోయింది. దీనిని వాల్మీకి ఈ విధంగా వర్ణించారు.

**ఉత్తిష్ఠ మూఢే కిం శేషే భయం త్వామభివర్తతే।**
**ఉపప్లుతమఘౌఘేన కిమాత్మానాం బుధ్యసే॥**
**అనిష్టే శుభగాకారె సౌభాగ్యేన వికత్థసే।**
**చలం హి తవ సౌభాగ్యం నద్రుయాః స్రోత ఇవాష్ణగే॥**

- సశేషం

# ప్రకృతి నియమాలు

ప్రకృతి యొక్క వాస్తవాలైన మూడు చేదు నియమాలు -

1. ఒకవేళ పొలంలో విత్తనం వేయకపోతే ప్రకృతి దానిని గడ్డీగాదంతో నింపివేస్తుంది. అదే విధంగా మనసును మంచి ఆలోచనలతో నింపకపోతే, ఆ మనసులో చెడు ఆలోచనలు చేరుకుంటాయి.

2. ఎవరి వద్ద ఏది వుంటుందో, దానినే వారు పంచుకోగలరు. సుఖం కలిగినవారు సుఖాన్నే పంచగలరు, దుఃఖం కలిగినవారు దుఃఖాన్నే పంచగలరు. జ్ఞానులు జ్ఞానాన్నే పంచగలరు. భయస్థులు భయాన్నే పంచగలరు.

3. మీకు మీ జీవితంలో ఏది లభించినా దానిని జీర్ణం చేసుకోవడం నేర్చుకోండి. ఎందుకంటే భోజనం అరగకపోతే రోగాలు పెరుగుతాయి. ధనం అరగకపోతే బడాయి పెరుగుతుంది. మాటలు అరగకపోతే చాడీలు పెరుగుతాయి. ప్రశంస అరగకపోతే అహంకారం పెరుగుతుంది. దుఃఖం అరగకపోతే నిరాశ పెరుగుతుంది. సుఖం అరగకపోతే పాపం పెరుగుతుంది.

విషయం చేదుగా వున్నా ఇది మాత్రం సత్యం!

**పూజ్య శ్రీ మాతాజీ వారి అమెరికా పర్యటన వివరాలు**

24 మే 2023 నుండి 13 జులై వరకు శ్రీ మాతాజీవారు అమెరికాలో పర్యటిస్తారు. ఇందులో భాగంగా శనివారం జులై 1 నుండి మంగళవారం జులై 4 వరకు డల్లాస్‌నందు సత్సంగములు జరుగును. మరిన్ని వివరములకు మాధవరావు పోపూరి గారిని (1-206-715-9990) సంప్రదించగలరు.

# ఈశావాస్యోపనిషత్

సేకరణ- యమ్. జానకిరామ శాస్త్రి

అజ్ఞానం అంధకారం వంటిది. అజ్ఞానం అనే అంధకారం నుంచి బయట పడినవారే యోగులు. ఈ అజ్ఞానం ప్రపంచాన్ని ఆశ్రయించి ఉంటుంది. కేవలం ప్రపంచాన్ని ఆశ్రయించి ఉండేవారు అజ్ఞానంలోనే ఉండిపోతారు. అజ్ఞానంలో ఉండేవారిని గూర్చి ఈశావాస్యోపనిషత్తు తెలియజేస్తోంది.

సత్వం, రజస్సు, తమస్సు అనే ఈ మూడు గుణాలతో కూడుకున్నదే ప్రకృతి. దీనికే అసంభూతి అని పేరు. అసంభూతి అనగా ఉత్పన్నం కానిదని, ఆది లేనిదని అర్థం. ప్రకృతి సహజమైంది కనుక దానిని సహజ ప్రకృతి అంటారు. నిజానికి వేదం ప్రకారం ఆత్మ పరమాత్మలవలె ప్రకృతి ఉనికిగల జడపదార్థం. దానిలో మూడు రకాల పరమాణువులు ఉంటాయి. అవి సమస్థాయిలో ఉండడాన్నే "సామ్యావస్థ" అంటారు. ఇంకా ప్రపంచరూపాన్ని ధరించని అనాది జడపదార్థమే ప్రకృతి. అందుకే దాన్ని అసంభూతి (పుట్టనిది) అని పిలుస్తారు. పరమేశ్వరుడు ఈ ప్రకృతి (అసంభూతి)కంటె భిన్నమైనవాడు. ప్రకృతిలో సత్వరజస్తమో గుణాలున్నాయి, కాని పరమేశ్వరునిలో అవి లేవు. కనుకనే అతన్ని నిర్గుణుడని పిలుస్తారు. త్రిగుణాతీతుడైన పరమేశ్వరుణ్ణి విడిచి ఎవరు త్రిగుణాత్మకమైన జడ ప్రకృతిని ఆశ్రయిస్తారో లేదా ఉపాసిస్తారో వారు అజ్ఞానమనే అంధకారంలో ఉంటారు.

ప్రకృతి ఎప్పుడూ అట్లాగే ఉండదు. అది పరమేశ్వరుని సామర్థ్యం వల్ల సాన్నిధ్యం వల్ల ప్రాణికోటి ఉపయోగార్థమై మహత్వాది రూపంలో పరిణామం చెందుతుంది. ఒక మాటలో చెప్పాలంటే ఈ ప్రపంచ రూపాన్ని ధరిస్తుంది. దీనికే సంభూతి అని పేరు. ప్రకృతి అనేది జడం. అది స్వయంగా పరిణామం చెందదు. సర్వశక్తిమంతుడైన పరమేశ్వరుని కారణంగానే అది స్వతంత్ర రూపాన్ని ధరిస్తుంది. ఇది తెలియని వాళ్లు అజ్ఞానంలో ఉండిపోతారు, రాగద్వేషాలకు లోనైపోతారు, ప్రపంచ పదార్థాలనే కోరుకుంటారు. ఒక విధంగా పరమాత్మను విడిచి ప్రపంచాన్నే ఆశ్రయిస్తారు. ప్రపంచోపాసకులుగా మిగిలిపోతారు. అటువంటివారే ఇంకా అజ్ఞానమనే పెనుచీకటిలో ఉన్నట్లుగా భావించాలని ఈశావాస్యోపనిషత్తు గుర్తుచేస్తుంది. ఈ జడ జగత్తు మూలకారణం చైతన్య స్వరూపుడైన పరమేశ్వరుడు. అతడు ప్రకృతిని

ప్రపంచంగా మార్చడంలో స్వతంత్రుడు. ప్రకృతికి స్వయంగా ప్రపంచంగా మారే స్వాతంత్ర్యం లేదు. ఎందుకంటే అది జడం కనుక. పుట్టింది కనుక ప్రపంచాన్ని "సంభూతి" అని, పుట్టలేనిది కనుక ప్రకృతిని "అసంభూతి" అని పిలుస్తారు. కాని ఈ విషయం విద్వాంసులకు తప్ప ఇతరులకు తెలియదు.

విద్యావంతునికి, అవిద్యావంతునికి భేదం స్పష్టంగా కనిపిస్తుంది. విద్యావంతుడు సృష్టికర్త పరమేశ్వరుని ఉపాసించగా, అవిద్యావంతుడు పరమేశ్వరుణ్ణి విడిచి పెట్టి ప్రకృతిని లేదా ప్రపంచాన్ని ఉపాసిస్తాడు. నిజానికి ప్రపంచం అవిద్యాస్వరూపం కల్గింది. పరమేశ్వరుడు విద్యా రూపధారి. సర్వజ్ఞుడు, సర్వ శక్తిమంతుడు కూడా.

జీవునికి బంధం అజ్ఞానం వల్లనే కల్గుతుంది. అజ్ఞానమే అవిద్య. బంధానికి కారణమైన అవిద్య నుంచి బయటపడిన వాడే విద్వాంసుడు. అజ్ఞానంతో ఉన్నంతకాలం జీవుణ్ణి ప్రకృతి, లేదా దాని పరిణామ రూపమైన ప్రపంచం బంధిస్తుంది. అందుకే ఈశావాస్యోపనిషత్తు పరమేశ్వరునికి, ప్రకృతికి ఉన్న భేదాన్ని తెలుసుకొని, నడుచుకోమంటుంది. ఎంతకాలం ప్రకృతిని ఉపాసిస్తామో అంతకాలం అజ్ఞానంలో మనం ఉన్నట్లే. ఇంకా చెప్పాలంటే ప్రకృతి ప్రేమికులమై, వుపాసించటమేగాక, చిత్రవిచిత్ర నామరూప జగత్తుకు ఆకర్షితులమై ఉన్నంతకాలం ఇంకా అంతకంటె ఎక్కువ అజ్ఞానంలో ఉన్నట్లే అవుతుంది. ప్రపంచానికి ఉపాదాన కారణం "ప్రకృతి" అని, ప్రపంచ నిర్మాణానికి స్వతంత్ర కారణం పరమేశ్వరుడని ఎవరు తెలుసుకుంటారో వారిని అవిద్య అంటుకోదు. వారు అవిద్య (అజ్ఞానం)లో ఎప్పుడూ వుండరు.

లోకంలో ఆయా వస్తువుల విషయంలో తరతమ భేదాలు కనిపిస్తాయి. ప్రకృతి జడం(జ్ఞానం లేనిది). పరమేశ్వరుడు పరమచైతన్యం(అత్యధిక జ్ఞానం) కల్గినవాడు. మనల్ని బంధించేది ప్రపంచమైతే, మనల్ని మోక్షం వైపు నడిపించేవాడు పరమేశ్వరుడే. అందుకే మనం ఎల్లవేళలా పరమేశ్వరుడినే ఉపాసించాలి.

**తరువాయి భాగము 36వ పేజీలో ...............................**

# గురు రక్షణకు దూరం అడ్డురాదు

(గత సంచిక తరువాయి)

ఆంగ్ల మూలం - శ్రీ రామస్వామి సంపత్
అనువాదం - జగన్నాథ ప్రసాద్

బ్యాండేజీ వెయ్యడం అయ్యాక 'మీ ఫీజు....' అని డాక్టర్‌గారిని అడిగాను. వారు నన్ను వారించి, 'భలే వారే! మీకు ఎంతో సహాయం చేసిన ఒక పేద రిక్షా అతను మీ దగ్గర డబ్బు తీసుకోలేదు. అటువంటిది నేను ఎలా తీసుకోగలను? నాలోనూ మానవత్వం వున్నది. దయచేసి ఇది నా సహాయంగా భావించండి' అన్నారు. ఆ మాటలతో నా కనుల నిండా ఆనందబాష్పాలు ఊరాయి! ఒకరిలోని కరుణ మరొకరిలోని కరుణను మేల్కొలిపింది! డాక్టర్‌కి కృతజ్ఞతలు చెప్పాను. అంతకంటే వేరే అవకాశం లేదు.

రిక్షా అతను నన్ను మెకానిక్ దగ్గరకు తీసుకువెళ్ళాడు. బాగుచేసిన స్కూటర్ సిద్ధంగా వుంది. రిక్షా అబ్బాయి మెకానిక్‌తో 'కాలు నొప్పితో అయ్యగారు స్కూటర్ నడుపలేరు. వారిని నేను వెనుక సీటుపై కూర్చోబెడతాను. నువ్వు డ్రైవ్ చెయ్యి. అయ్యగారిని వారి ఇంటివద్ద దింపు. ఆయన దగ్గర డబ్బులు పుచ్చుకోకు' మళ్ళీ ఆజ్ఞాపించాడు. ఎంత ధీమా! ఎవరితడు? ఎవరైనా నా పాలిట దైవమే! 'అలాగే' అని తలాడించాడు మెకానిక్.

అతని పనులకు, మాటలకు నా హృదయం ద్రవించింది. నేను అతనికి కృతజ్ఞతలు చెప్పి, 'నీ పేరేమిటి బాబూ!' అన్నాను. అతను చిరునవ్వుతో 'మీరే చెప్పేశారుగా అదే నా పేరు' అని చెప్పి, మెకానిక్‌తో 'అయ్యగారిని జాగ్రత్తగా తీసుకువెళ్ళు' అని చెప్పి నాతో 'సెలవు సార్!' అని చెప్పి వెళ్ళిపోయాడు.

విజయవాడలో పటమటలోని మా ఇంటిదగ్గర ఆపాడు స్కూటర్. నన్ను జాగ్రత్తగా దింపి, లోపలికి తీసుకువెళ్ళాడు. స్కూటర్ బాగు చేసినందుకు డబ్బు ఇవ్వబోగా అతను తీసుకోలేదు. 'కనీసం మంగళగిరి వెళ్ళడానికి బస్సు చార్జీకైనా ఇవ్వాలిగా ఇవ్వనీ' అంటూ బలవంతంగా అతని జేబులో 20రూ.ల నోటు పెట్టాను. కాసేపు సందేహించాడు. 'మంచినీరు కావాలా?' అని అడిగాను. వద్దన్నట్లుగా

తలాడించాడు. 'సార్! ఎవరైనా తమ వాహనానికి ప్రమాదం జరిగితే, వెంటనే అమ్మేస్తారు. మీరు కూడా మీ స్కూటర్‌ని అమ్మదలచుకుంటే చెప్పండి నేను కొంటాను' అన్నాడు. 'అలాగే తప్పకుండా. నేను దాన్ని అమ్మాలనుకున్నప్పుడు నీ దగ్గరకే వస్తాను' అన్నాను. అతను వెళ్ళిపోయాడు.

సుమారు ఒక నెల తరువాత నేను మంగళగిరి వెళ్ళాను. 'బాబు అనే రిక్షా అతను ఎక్కడ వుంటాడు?' అని ఎంక్వైరీ చేశాను. రిక్షా డ్రైవర్లందరినీ అడిగాను. ఎవరైనా ఒక్కటే సమాధానం 'బాబూ అనే పేరుగలవారెవరూ అసలు ఇక్కడ లేరు సార్!' అని.

అప్పుడు నాకు స్ఫురించింది సమర్థ సద్గురు బాబే ఆ రోజు నా రక్షణకై రిక్షావాడి వేషంలో స్వయంగా వచ్చారని! ఈ విషయం నాకు ఎప్పుడు గుర్తుకు వచ్చినా నా మనస్సు ఉద్వేగానికి లోనై, శరీరమంతా రోమాంచితమవుతుంది. ఎందుకంటే, ఆ సమయంలో శ్రీబాబు ఇండియాలోనే లేరు, తల్లి తాబేలు వలె దూరంగా అమెరికాలో వున్నారు! ధన్యోస్మి!!

---

**35వ పేజీలోని ఈశావాస్యోపనిషత్ తరువాయి భాగము ................................**

ప్రకృతి జీవులను బంధిస్తుందనే విషయం గమనింపదగింది. ప్రకృతి గుణాలు సత్వరజస్తమో గుణాలు. ఈ గుణాలకే త్రాళ్ళని అర్థం. త్రాళ్ళే కదా మనల్ని బంధించేవి. త్రిగుణాత్మకమైన ప్రకృతి మనల్ని బంధిస్తోంది. అట్లే దాని పరిణామ రూపమైన జగత్తు మనల్ని అమితంగా ఆకర్షించి, అజ్ఞానంలో ముంచుతుంది. సృష్టికర్త పరమేశ్వరుణ్ణి తెలుసుకోకుండా చేస్తుంది.

కర్మవశాన మనం ప్రకృతిచే బంధింపబడుతున్నాము. మళ్ళీ మళ్ళీ శరీరధారులమవుతున్నాం. అనగా జన్మలెత్తుతున్నాం. మరో జన్మలేకుండా చేసుకోవాలంటే, పుణ్యకర్మలు చేస్తూనే కర్మఫలాలను ఈశ్వరార్పితం చేయాలి. ప్రపంచంలో కారణకార్యరూపం గల వస్తువులను గుర్తించి, వాటికంటె భిన్నమైన పరమేశ్వరుణ్ణి వుపాసించమని, దానివల్ల మనకు శ్రేయస్సు కల్గుతుందని ఈశావాస్యోపనిషత్తు బోధిస్తుంది.

# గురువు వెంట వుంటే

- రేఖ

(గత సంచిక తరువాయి)

తిన్నడికి మడి, ఆచారం తెలియదు. పూజ చేయాలంటే ఒక పాత్ర, పళ్ళెం వుండాలని తెలియదు. కానీ, ఆ బ్రాహ్మణుడు చేసే, ప్రతి క్రియను శ్రద్ధగా చూశాడు. తిన్నడు ముందుగా ఒక పందిని వేటాడి, మాంసాన్ని తీసి, కాల్చి, ఆ మాంసం సరిగ్గా కాలిందా లేదా అని తన నోటితో రూచి చూసి, తరువాత పూజ చేయడం కోసం కొన్ని ఆకులు కోసి, ఇంకో చేతితో పట్టుకున్నాడు. ప్రక్కనే వున్న స్వర్ణముఖి నదిలో నీళ్ళు తన పుక్కిటతో పట్టి, గుడికి వచ్చాడు. రెండు చేతులూ ఖాళీ లేవు. అందుకని తన చెప్పు కాలితో అంతకు ముందు పూజ చేసిన నిర్మాల్యాన్ని తీశాడు. ఆ తరువాత తన నోటిలో వున్న నీళ్ళతో శివలింగం మీద ఉమ్మి అభిషేకం చేశాడు. తన ఒక చేతిలో వున్న ఆకులతో పూజ చేశాడు. మరొక చేతిలో వున్న మాంసాన్ని తినమని సమర్పించాడు. అయ్యో! స్వామికి కళ్ళు లేవు (అది స్వామి యొక్క లింగరూపం అని తెలియక) అని తనకు వున్న రెండు కళ్ళల్లో ఒక కన్నుని తన దగ్గిర వున్న పందిని చంపిన కత్తితో పెరికి స్వామి లింగం మీద అతికించాడు. స్వామి ఈ సమయంలో తన భక్తుని ఇంకా పరీక్షించాలి అని అనుకున్నాడో యేమో! ఆయన తనకు ఇంకో కన్ను వుండవలసిన ప్రదేశంలో రక్తం కారేటట్లు చేశాడు. ఇది తిన్నడు గమనించాడు. ఎంతో బాధపడిపోయాడు ఆ దృశ్యం చూసి. వెంటనే ఆనవాలు కోసం చెప్పుతో వున్న తన కాలుని శివలింగం మీద పెట్టి, తన రెండో కన్నుని కూడా అదే కత్తితో ఊడబెరికి, స్వామికి అది వుండవలసిన స్థానంలో అతికించాడు.

తిన్నడికి తనంటే తనకి ఎంత గౌరవమో తను ఆరాధించే దేవుడిని కూడా అలాగే చూసుకున్నాడు. తనకి భిన్నంగా చూడలేదు. తనదంటూ ఏదీ లేదని త్యాగం చేశాడు. జ్ఞాననేత్రంతో దర్శించాడు. ప్రకాశించాడు. ఈనాటికీ ప్రకాశిస్తున్నాడు.

ఈ భక్తిని చూసి శ్రీ శంకరభగవత్పాదులవారు వారు రచించిన శివానందలహరిలో అట్టి (తిన్నడి) భక్తిని ఏమని చెప్పగలను అని కొనియాడారు. శ్రీమాతాజీ ఆ శ్లోకాన్ని చెప్పి వ్యాఖ్యానించారు....

మార్గావర్తిత పాదుకా పశుపతే
రంగస్య కూర్చాయతే
గండూషాంబు నిషేచనం పురరిపో
ర్దివ్యాభిషేకాయతే
కించిద్భక్షిత మాంస శేష కబళం
నవ్యోపహారాయతే
భక్తిః కిం నకరోతిరహెూ
వనచరోభక్తా వతంసాయతే

కాళహస్తిలో జరిగిన తిన్నడి కథను దృష్టిలో వుంచుకుని ఈ శ్లోకం చెప్పారు శ్రీ శంకరులు. ఇక్కడ శంకరులు వారి ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ - ఆహా! శివభక్తి యొక్క మహిమ చమత్కారం ఏమని చెప్పగలం? అక్కడ అడవి దారులలో తిరిగే అపరిశుద్ధమైన చెప్పు ఈశ్వరుని నిర్మాల్యం తుడిచే కుంచె అయింది. పుక్కిటితో పట్టి తెచ్చిన నీరు పరమ శివుడికి దివ్యాభిషేకం అయింది. కొంచెం తినగా మిగిలిన మాంసం ముక్క శివునికి కొత్త నైవేద్యంగా వుపయోగ పడింది. భక్తి ఏమైనా చేయగలదు. కొండలలో తిరిగే కోయవాడు భక్త శిరోమణి అయ్యాడు.

దీనిని బట్టి భక్తి ప్రధానం కానీ, మంత్ర తంత్రాలు, ఆచార నియమాలు అంత ముఖ్యం కావనీ, ఈశ్వరుడు భక్త సులభుడు అనీ తెలుస్తోంది.

- సశేషం

## సమర్ధ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఈ క్రింది మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***జూలై 2023 :*** AS 3728, 6405, 6692, 6724, 7135, 7184, 7783, 7785, 8149, 9077, 9078, 9081-9085

***ఆగస్ట్ 2023 :*** AS 6271, 6533, 7789, 8141, 8142, 8144, 8145, 8795, 8830, 8838, 8847, 9119-9123 LM 4389

# సమర్థ సద్గురునాధుని దివ్య చరిత్ర

## శ్రీ మాపులేటి ఈశ్వరరాజుగారితో శ్రీబాబు

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

మహాత్ములెన్నడూ తాము మహాత్ములమని అనుకోరు. మహాత్ముల వలె కనిపించడానికి కూడ యిష్టపడరు. పైగా, జన బాహుళ్యానికి తమ ఆచూకీ అంతుపట్టని విధంగా వేష భాషలలో కూడా మభ్యపరుస్తారు. కాని మరొక మహాత్ములు వారిని ప్రధమ వీక్షణంలోనే గుర్తించగలుగుతారు. కనుకనే "యోగి యోగి మెచ్చు"నని వేమన యోగి పుంగవుడు ఉద్ఘాటించిన సత్యమును శ్రీ బాబు మాటిమాటికి తలచుకునే వారు.



శ్రీబాబు జన బాహుళ్యంలో సంచరించినప్పుడు, ప్రయాణాలలోను సిల్కు పంచెను గాని, పెద్ద జరీ అంచు పంచెను గాని ధరించే వారు. సిల్కు లాల్చీ ధరించే వారు. బంగారు ఆభరణాలు ధరించేవారు. "నన్ను యీ వేషంలో చూసి యీ ఠీవిని, దర్జాను గమనించిన వాళ్ళు నేను ఏ జమిందారునో, ఏ నాటు కోటి చెట్టియార్‌నో అనుకుంటారు. ఆ విధంగా వాళ్ళ బెడద నుండి తప్పించుకుంటాను" అనేవారు. అందుకు తగినట్లుగానే, వారిని ఎవరైనా పలకరించి "తమరు ఎవరు?" అని అడిగితే శ్రీ బాబు "మాది వజ్రాల వ్యాపారము" అనేవారు. ఆ మాట నమ్మేసేవారు జనం. "అలా చెప్పారేమిటి బాబూ? " అని భక్తులు అడిగితే "అవును నాది నిజంగా వజ్రాల వ్యాపారమే. బుట్టెడు గాజు రాళ్ళతో ఒక వజ్రం కలిసి ఉన్నా, వజ్రాల విషయం తెలిసిన వ్యాపారి, ఆ వజ్రమును తేలికగా గుర్తుపట్టి, ఆ గాజు రాళ్ళ నుండి దానిని వేరు చేయగలడు.

వేలకు వేల మంది జన బాహుళ్యంలో, ఏ ఒక్కడో తత్త్వ జిజ్ఞాస కలిగిన వాడుంటాడు. తత్త్వ వేత్తలైన మహాత్ములు, ఆ జన బాహుళ్యమంతటిని చూస్తూనే, ఆ జిజ్ఞాసాపరుణ్ణి యిట్టే గుర్తుపట్ట గలుగుతారు. అతన్ని తమ చెంతకు చేర్చుకొని తరించే మార్గం చూపగలుగుతారు. మరి మన వ్యాపారం అదే గదా!" అనేవారు.

ఉత్తర భారత దేశంలో ఆ రోజులలో శ్రీ ప్రభుదత్త బ్రహ్మచారిగారు ప్రసిద్ధులైన మహాత్ములు. శ్రీకృష్ణ భగవానుడు వారి ఆరాధ్య దైవము. వారు మొదటిసారి శ్రీ బాబును దర్శించినపుడు "మేరే శ్యామ్" అని శ్రీ బాబును కౌగలించుకొని బ్రహ్మానంద పరవశులైనారు. ఆ తరువాత ఎన్నోసార్లు వారివురి సమావేశం జరిగింది. శ్రీ ప్రభుదత్త బ్రహ్మచారి గారు, శ్రీ బాబును "మేరే శ్యామ్", "మేరే కృష్ణ" అని సమాలింగన పూర్వకంగా సంభావించేవారు.

పరమ హంస పరివ్రాజకాచార్య శ్రీ అవధూతేంద్ర సరస్వతీ స్వామివారు **"నాస్తి నాస్తి కలౌ నాస్తి । హరి నామ వినా గతిః"** అని భగవన్నామ సంకీర్తన మహిమను, దాని ఆవశ్యకతను వెల్లడిస్తూ, మధురాతి మధురమై భక్తి భావ భరితమైన నామ సంకీర్తన ద్వారా, భారతదేశమంతటను "సంకీర్తన ప్రభంజనము"ను సృష్టించి ఎందరెందరో జనులను సంకీర్తనాసక్తులుగా చేశారు. శ్రీ బాబు 'రామ' ,'కృష్ణ' అవతార తత్త్వములను సమన్వయ పరచిన మహాత్ములని శ్రీ అవధూతేంద్ర సరస్వతీ స్వామి వారు గ్రహించి, ఎన్నోసార్లు తమ మధురనామ సంకీర్తనతో శ్రీ బాబుకు ఆనందం కలిగించటమేగాక అదొక మహద్భాగ్యంగా భావించారు.

ఈ మహాత్ములు ముగ్గురి సమావేశమునకు నిమిత్త కారణులైన భక్తులు మావులేటి ఈశ్వరరాజుగారు. వీరు గుండుగొలను వాస్తవ్యులు. శ్రీ బాబు భక్తులు. ఎందరో మహాత్ముల దర్శనం చేసుకొని, వారి సాంగత్య భాగ్యాన్ని పొందినవారు. శ్రీ ప్రభుదత్త బ్రహ్మచారిగారితోను, శ్రీ అవధూతేంద్ర స్వామి వారితోను విశేష పరిచయం గలవారు.

ఒకనాడు వారు తమ ధర్మపత్ని సుశీలమ్మగారితోను, జ్యేష్ఠ పుత్రిక కాళీమాతతోను శ్రీ బాబు దర్శనం కోసం గుంటూరులో పాండుగారింటికి వచ్చి ఉన్నారు. అప్పుడు శ్రీ ప్రభుదత్త బ్రహ్మచారిగారు, శ్రీ అవధూతేంద్ర స్వామివారితో కలసి గుంటూరు వచ్చినట్లు వారికి తెలిసింది. ఈశ్వరరాజు గారు ఆ మహాత్మురిరువురిని శ్రీ బాబు సన్నిధికి తీసుకొని రావలెనని అభిలాష తెలుపగా, శ్రీ బాబు "మహాత్ముల సాంగత్యం కంటె మానవుడు కోరదగినదేమున్నది? తప్పక తీసుకొని ర"మ్మన్నారు. ఆ విధంగా పాండుగారింట్లో ఆ ముగ్గురు మహనీయుల అపురూప సమాగమం జరిగింది.

\- సశేషం

## విష్ణు  కథలు

(గత సంచిక తరువాయి) -రమణ ప్రసాద్

# సమర్థ రామదాసు

రాముడు ప్రత్యక్షమై "అజ్ఞాన్! దేవుడెప్పుడైనా భోజనం చేశాడా? దేవుడు ఎప్పుడైనా మాట్లాడాడా? ఇదేం మొండి పట్టయ్యా? అన్నాడు. మాట్లాడని దేవుడు మాట్లాడినప్పుడు ఇక వచ్చి భోంచెయ్యడానికేం? అన్నాడు అజ్ఞాన్. "సరే తప్పుతుందా?" అని రాముడు భోజనానికి కూర్చోబోయాడు. "అదేమిటయ్యా మీతో వారందరూ ఉండాలి అన్నారే మా గురువుగారు?" అన్నాడు అజ్ఞాన్. "సరే పిలుస్తాను" అని అందరినీ పేరుపేరునా పిలిచారు రాములవారు, సీతమ్మ, లక్ష్మణుడు, హనుమంతుడు వచ్చి కూర్చున్నారు. అందరికీ స్వహస్తాలతో వడ్డించాడు అజ్ఞాన్. అందరికీ తాంబూలం ఇస్తూ, రేపటినుంచీ నైవేద్యం అవగానే పిలుస్తాను రండి" అన్నాడు అజ్ఞాన్.

రోజూ వేళకు నైవేద్యం, ఆ తర్వాత ఆహ్వానం, భోజన కార్యక్రమం సాఫీగా జరుగుతోంది. ఒకనాడు అజ్ఞాన్ "మీరు రోజూవచ్చి తేరగా తినిపోవడం కన్నా నాకు తోడుపడచ్చు కదా! 'కష్టపడేవాళ్ళకే అన్నం పెట్టాలి' అన్నారు మా గురువుగారు. హనుమంతుడిని వంటచెఱకు తెమ్మనండి. లక్ష్మణుడిని కూరగాయలు తెమ్మనండి. సీతమ్మ కూరలు తరిగి ఇస్తుంది." అన్నాడు. రాములవారు "నేనేమి చెయ్యను?" అన్నారు. "సరే చేస్తానంటున్నావు కాబట్టి పూజకు అన్నీ సిద్ధం చెయ్యి. నేను వచ్చి పూజచేసి నైవేద్యం సమర్పిస్తాను." అన్నాడు అజ్ఞాన్.

ఇలా జరుగుతుండగా ఒకనాడు అజ్ఞాన్ ఏడుస్తున్నాడు. "ఎందుకు ఏడుస్తున్నావు?" అని రాములవారు అడిగారు. "మా గురువుగారికి పాయసం అంటే ఎంత ఇష్టమో! ఆయనకు ఇవాళ ఈ పాయసం పెట్టాలని ఉంది" అన్నాడు అజ్ఞాన్. అదేమిటయ్యా కాశీ ఎక్కడా? మనమెక్కడా?" అన్నారు రాములవారు.

అజ్ఞాన్ హనుమంతుడి వైపు చూశాడు. "హనుమా వెళ్ళు!" అన్నారు రాములవారు. అజ్ఞాన్‌ను భుజాలపై ఎక్కించుకొని కాశీ చేరుకున్నాడు హనుమంతుడు. "అరుగో సమర్థులు! గప్‌చిప్‌గా వారికి భోజనం పెట్టి వచ్చేయి. నా గురించి చెప్పావా నీ కాళ్ళు విరగగొడతాను" అన్నాడు. సమర్థులు అజ్ఞాన్‌ను చూసి "ఇక్కడికి ఎలా వచ్చావు?" అన్నారు. "నన్ను ఆయన తీసుకువచ్చాడు" అని చెట్టువైపు చూపించాడు. అక్కడ హనుమంతుని చూసి ఆయనకు పాదాభివందనం చేశారు సమర్థులు. "మా వాడి గురించి మీరు ఇంత శ్రమ పడ్డారా? అన్నారు. "ఈ కష్టమేమీ పెద్ద కష్టం కాదు. కోటపైన వీడు మా అందరిచేత నానా చాకిరీ చేయిస్తున్నాడు. చివరికి రామలక్ష్మణులచేత, సీతమ్మచేత పనులు చేయిస్తున్నాడు. మీరు వచ్చి మాకు దాస్యవిముక్తి గావించాలి" అన్నాడు హనుమంతుడు. అజ్ఞాన్ యొక్క సామర్థ్యాన్ని మిగతా శిష్యులకు చూపి "మీరు కాశీకి వచ్చి బావుకున్నదేమిటి? అంటు సజ్జన్‌గఢ్‌కు ప్రయాణమైనారు సమర్థులు.

ఒకసారి సమర్థులకు కఫబాధ పట్టుకుంది. ఆయనను పరీక్షించిన వైద్యులు "మీరు కొండపైన నిలువనీటిని త్రాగుతున్నారు. మీరు పారే నీటిని త్రాగితే మీకు కఫబాధ తగ్గవచ్చు" అన్నారు. అప్పుడు కళ్యాణ్ ప్రక్కనే వున్నాడు. కళ్యాణ్ "స్వామీ! కొండ దిగగానే ఉర్మోడినది ఉంది. ఆ నీరు త్రాగితే మంచిదేమో" అన్నాడు. "నీ మొఖం ఆ నదికి చేరాలంటే రెండు క్రోసులైనా పోవాలి. నాకు స్నానానికి, అనుష్ఠానానికి, త్రాగటానికి రెండు గుండిగల నీళ్ళైనా ఉండాలి. ఒక గుండిగ నీళ్ళు తేవాలంటే పది మందైనా కావాలి" అన్నారు సమర్థులు. తమ పైన ఈ పని ఎక్కడ పడుతుందో అని శిష్యులు భయపడ్డారు.

- సశేషం

---

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

# శ్రీ కాళీ వనాశ్రమ శాఖ, భీమవరం

## పశ్చిమ గోదావరి జిల్లా (ఆం. ప్ర)

## సంకల్పిత భవన నిర్మాణం

సమర్థ సద్గురుదేవులు శ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్ వారు లోకకల్యాణం కొరకై ఎన్నో చోట్లకు వెళ్ళి ఎందరో భక్తుల ఆర్తిని బాపిన అవతార పురుషులు. వారు నడయాడిన ఊరు భీమవరం మరియు ఆ చుట్టుప్రక్కల ఉన్న యనమదుర్రు, దిరుసుమర్రు మొదలగు గ్రామములు. "భీమవరంలో ఆశ్రమం స్థాపించాలని శ్రీ బాబూజీ మహరాజ్ వారి చిరకాల వాంఛ".

శ్రీ స్వామివారు మహా ప్రస్థానం పొంది 35 సంవత్సరములు అయినవి. అచ్చటి భక్తులందరూ చేరి భీమవరం-విజయవాడ (ఉండి) రోడ్డున దాతలు ఇచ్చిన స్థలములో బృందావనం, దాని ప్రక్కన అన్నదానశాల, వసతి గృహము నిర్మింప సంకల్పించినారు. ఈ నిర్మాణానికి షుమారు 7 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఈ భవన శంకుస్థాపన యోగిని శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ వారు, శ్రీ కాళీవనాశ్రమ పీఠాధిపతి ది.10.05.2023 బుధవారము రాత్రి (తెల్లవారితే గురువారము) 3.24 గం.లకు చేశారు.

ఈ సందర్భమున భక్తులకు చేయు విన్నపమేమనగా, భక్తులెల్లరూ ఉదార స్వభావముతో ముందుకు వచ్చి త్వరలో ఈ భవన నిర్మాణము పూర్తియగునట్లు తమ సహాయ సహకారములను ధన రూపేణ, వస్తు రూపేణ అందించమని ప్రార్థించుచున్నాము. భక్తులు ఒసగు విరాళములకు ఐ.టి యాక్ట్ 80జి క్రింద రాయితీ లభించును.

REGD. NEWS MAGAZINE PERIODICAL
Posted on 5th and 6th of every month.

RNI No. : 37804/81
Postal Regd. No. : GTR/27/2021-2023

## 14-05-23 నాడు దేవర గోపవరం గ్రామమునందు శ్రీ మాతాజీవారిచే శ్రీ కనకదుర్గ అమ్మవారి మూర్తి ప్రతిష్ఠ







If undelivered please return to
SAMARDHA SADGURU
Sri Kali Gardens Ashramam - 522 508,
Guntur Dist., A.P.